నేటి నిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## నేటి కందం-నేటికి అందం

హీరో మోటో కార్పు యు
మారుతి సుజుకీయు నూత్న మర్యాదలతో
నేరుగ ఫ్లెక్స్ ఫ్యూయలుతో
తీరగు హాహనముల నిట త్రిప్పగ నెంచెన్ !!
(హీరో మోటోకార్ప్ టూవీలర్స్ ను, మారుతీ సుజుకీ కార్లను ఫ్లెక్స్ ఫ్యూయల్ తో విడుదల చేస్తున్నాయి. దీని వలన పెట్రోల్ డీజిల్ మీద ఒత్తిడి తగ్గి ఇథనాల్ వంటి బయో ఫ్యూయల్ కు డిమాండ్ పెరిగిఆర్థికాభివృద్ధి జరుగుతుంది.)
-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

కాషాయం ఆక్టోపస్
కాచుకొని చూస్తున్నది
తృణమూల్ ను బెంగాల్లో
తునకలుగా చేస్తున్నది.
మిగిలింది ఇకమీదట
మింగివేసే తంతే
మమత పరుగు ప్రస్థానం
మృగ్యమైతే వింతే
-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శనివారం 6-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:237 పేజీలు:6 వెల: రూ.1/-

## ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు కొల్లగొట్టారు

-సీఎం రేవంత్ రెడ్డి..



మహబూబ్‌నగర్, జూన్ 5: గత ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమీషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమీషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇవాళ (శుక్రవారం) సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహబూబనగర్ ఎంపీగా కేసీఆర్ ఉన్నప్పుడే తెలంగాణ వచ్చిందని, కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును ఆయన పట్టించుకోలేదని మండిపడ్డారు.

పాలమూరు ప్రాజెక్టులను కేసీఆర్ పూర్తి చేస్తారని ఆశించామని, కానీ ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఆయన చేసిందేమీ లేదని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. వేల కోట్లు పెట్టి కేవలం పంపులు, లిఫ్టులు మాత్రమే నిర్మించారని సీఎం రేవంత్ మండిపడ్డారు.

నీటి పారుదల శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పటికీ నగదు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్టులకు కనీసం భూసేకరణ చేయకుండా ఎక్కడికక్కడే వదిలేశారని.. ఆర్ అండ్ ఆర్ (ఖీడఖీ) ప్యాకేజీలు ఇవ్వకుండా రిజర్వాయర్లలో నీరు నింపగలమా? అంటూ ప్రతిపక్షాలను ఉద్దేశించి సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రతి 6 నెలలకోసారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. త్వరలో భూసేకరణ పూర్తి చేస్తామని, ప్రతిపక్షాలు అడ్డుకునేలా వ్యవహరించొద్దని సీఎం రేవంత్ హితవుపలికారు.

## ఎల్ అండ్ టీ ఆర్మ్స్ సిస్టమ్స్ కాంప్లెక్స్‌లో ప్రధాని మోదీ సమీక్ష



సూరత్, జూన్ 5: ప్రధాని మోదీఇవాళ గుజరాత్‌లో పర్యటిస్తున్నారు. సూరత్‌లో ఉన్న ఎల్ అండ్ టీకి చెందిన ఆర్మ్స్ సిస్టమ్స్ కాంప్లెక్స్‌ను ఆయన విజిట్ చేశారు. అక్కడ ఆయన రక్షణరంగ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. సూరత్ ఎల్ అండ్ టీలో అత్యాధునిక రక్షణరంగ పరికరాలను తయారు అవుతున్నాయి. వాటి గురించి మోదీ అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మోదీ ఈ పర్యటన చేపట్టారు. తన పర్యటనలో భాగంగా ఆయన ఓ మొక్కను నాటారు. పర్యావరణ సంరక్షణ, సుస్థిర అభివృద్ధి సందేశాన్ని ఇచ్చారు. కంపెనీలో జరుగుతున్న దేశీయ రక్షణ వ్యవస్థ ఉత్పత్తుల గురించి ఎల్ అండ్ టీ అధికారులు మోదీకి వివరించారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రాజెక్టులో భాగంగా సూరత్ ఎల్ అండ్ టీలో అనేక రక్షణ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. హెవీ ఇంజినీరింగ్, ఆర్మర్డ్ సిస్టమ్స్ ఇక్కడ డెవలప్ అవుతున్నాయి. ఈ సెంటర్‌లోనే అయిదో జనరేషన్‌కు చెందిన అడ్వాన్సడ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను డెవలప్ చేయనున్నారు.

## పనుల వేగం పెంచాలి

-పాలమూరు ప్రాజెక్టులపై సీఎం ప్రత్యేక దృష్టి



మహబూబ్‌నగర్, జూన్ 5: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండో రోజు నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన కీలక పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెరలోని పీఆర్ఎల్ఎస్ పంప్‌హౌస్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన నార్లాపూర్ ప్యాకేజీ-2, ప్యాకేజీ-3 కాలువల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరితో కలిసి పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి పాలమూరు ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పూర్తి ద్వారా జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్‌ను సందర్శించిన హీరోషిమా ప్రతినిధుల బృందం



హైదరాబాద్, జూన్ 5: జపాన్ దేశం హీరోషిమా రాష్ట్రానికి చెందిన ప్రతినిధుల బృందం తెలంగాణ శాసన మండలి, శాసన సభను సందర్శించారు. ఈ సందర్భంగా శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ వారికి స్వాగతం పలికారు. మండలి చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని వివరించారు

తెలంగాణ రాజధాని నగరంలో అన్ని దేశాలకు చెందిన ప్రజలు జీవిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి విప్‌లు అద్దంకి దయాకర్ , వెంకట నర్సింగరావు , ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్ , అంజి రెడ్డి , ఎమ్మెల్యేలు టి రామ్మోహన్ రెడ్డి , పాల్వాయి హరీష్ , శాసన మండలి సెక్రెటరీ డా. నర్సింహాచార్యులు , శాసన సభ సెక్రెటరీ ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య

మరియు

ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం

శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో

శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.

తేది : 19-06-2026, శుక్రవారం, సమయం : సా|| 6.00 గంటలకు



" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

ముఖ్య అతిథి : లయన్ డా|| వై. ఎమ్. ధర్, లయన్స్ క్లబ్, మాజీ గవర్నర్
సభాధ్యక్షులు : శ్రీ పి. పవన్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్ధన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ
గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం
పురస్కార గ్రహీత : శ్రీమతి డా|| పి. భవాని, కన్సల్టింగ్ హోమియో ఫిజీషియన్
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీమతి కె. కామేశ్వరి, ట్యాక్స్ కన్సల్టెంట్
ఆత్మీయ అతిథి : శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి, మేనేజర్ సాహితీ కిరణం
పురస్కార ప్రదాత : శ్రీ ఏకా నాగరాజు రామమోహన్ రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్
వందన సమర్పణ : శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని

లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య

ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650.



## 500 మంది పోలీసుల మెరుపు దాడి.. ఉలిక్కిపడ్డ స్పా సెంటర్ల నిర్వాహకులు

హైదరాబాద్, జూన్05: నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. దాదాపు 500 మంది పోలీసులు.. బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు.

స్పా సెంటర్ల నుంచి రెంట్ తీసుకోవడం తప్ప.. అందులో ఏం జరుగుతుందో కూడా ఓనర్లు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. కొన్ని స్పా సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి కూడా.. ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు గుర్తించారు. నగరంలోని స్పా సెంటర్ల భారీగా ఉన్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆయా ఫిర్యాదుల మేరకు పోలీసులు దాడులు చేస్తున్నారు.

ఈ సందర్భంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానీ నగరంలో ఒకే సారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేయడం ఇదే ప్రథమం అనే చర్చ నడుస్తుంది. అలాగే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. పోలీస్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా.. వీటికి అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## మైత్రీవనం అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, జూన్ 5: మైత్రీవనం అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈరోజు(శుక్రవారం) పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హర్ష మెస్‌ను కూడా రంగనాథ్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మైత్రీవనం సమీపంలో ఉన్న కేఎస్ఆర్ భవనానికి అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలిస్తామన్నారు. నాలాను ఆక్రమించి భవనం కన్‌స్ట్రక్షన్ జరిగితే కచ్చితంగా కూలగొడతామని స్పష్టం చేశారు. కేఎస్ఆర్ భవనం షాప్స్ పక్కనే ఉన్న హర్ష డీలక్స్ మెస్‌ను కూడా పరిశీలించామన్నారు. అగ్నిప్రమాదంపై పోలీసుల విచారణ జరుగుతోందని తెలిపారు.

హర్ష మెస్ డీలక్స్‌లో స్పార్క్ వల్ల ప్రమాదం జరిగిందా?.. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలుతుందని రంగనాథ్ వెల్లడించారు. నాంపల్లి బిల్డింగ్ అగ్నిప్రమాదం అనంతరం ఎన్ఓసీలు జారీ చేశామన్నారు. ప్రమాదం ఎలా జరిగిందన్న అంశంపై దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. అగ్నిప్రమాదం జరిగిన భవనానికి ఎంట్రీ అండ్ ఎగ్జిట్ పాయింట్లు ఒకే వైపు ఉన్నాయన్నారు. బిల్డింగ్‌కు ఫైర్ సేఫ్టీ నిబంధనలు లేవని తెలిపారు. హర్ష మెస్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని బాధితులు చెప్తున్నారని.. ప్రమాదానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడవుతాయని రంగనాథ్ పేర్కొన్నారు.

## ఒకే కుటుంబంలో విషాదం.. ఈతకు వెళ్లి నలుగురి చిన్నారుల మృతి

కామారెడ్డి, జూన్05: జిల్లాలోని పిట్లం మండలం బొల్లాక్‌పల్లిలో విషాదం చోటు చేసుకుంది. మంజీరా నదిలో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. బొల్లాక్‌పల్లి సమీపంలోనీ మంజీరా నదిలో అనిత, పావని, శ్రీవాణి, భాను ఈతకు దిగారు. వీరంతా నదిలో ఊబిలో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని ఒక మహిళ వారిని రక్షించే ప్రయత్నం చేసి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను రక్షించారు. అలాగే ఊబిలో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు బొల్లాక్‌పల్లికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శుక్రవారం బాన్సువాడ మండలం బుడిమి గ్రామం వద్ద ఎల్లమ్మ వేడుక నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు పాల్గొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేడుక జరిగింది. అనంతరం భోజనాలు చేసిన తర్వాత నలుగురు చిన్నారులు మంజీరా నదిలో స్నానం చేసేందుకు వెళ్లి.. ఊబిలో చిక్కుకుని మరణించారని పోలీసులు చెప్పారు.

## కల్తీ చాక్లెట్ల తయారీ గుట్టురట్టు.. ఒకరి అరెస్ట్

హైదరాబాద్, జూన్ 5:మహానగరంలోని కల్తీ చాక్లెట్ల తయారీ గుట్టును హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్ రట్టు చేసింది. సీతారాంబాగ్ (పాత మల్లేపల్లి) ప్రాంతంలో విగ్నెట్ ఫుడ్ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై హెచ్ ఫాస్ట్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా గడువు ముగిసిన రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించింది. అందుకు సంబంధించి కార్తీక్ అనే వ్యక్తిని హెచ్ ఫాస్ట్ టీమ్ అరెస్ట్ చేసింది. ఈ సంస్థలో రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్‌కు సమాచారం అందింది. దీంతో ఈ సంస్థపై సదరు టీమ్ దాడి చేసింది.

## తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరం: రాంచందర్‌రావు

మహబూబాబాద్, జూన్ 5: తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు.

2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## మాజీ ప్రేయసి గొంతు కోసిన ప్రేమోన్మాది..

పంజాబ్, జూన్ 5: ఓ ప్రేమోన్మాది మాజీ ప్రేయసిని అత్యంత దారుణంగా హత్య చేశాడు. అందరూ చూస్తుండగానే కత్తితో పలుమార్లు పొడిచి ప్రాణాలు తీశాడు. అడ్డుకోబోయిన సహోద్యోగులను చంపేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. అనంతరం కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటనకు సంబంధించిన భయానక దృశ్యాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. పూర్తి వివరాల్లోకి వెళితే..

మొహాలీలో నిందితుడు హర్జిందర్ సింగ్ మాన్, అతని మాజీ ప్రేయసి డింపుల్ ఓ ప్రైవేట్ కొరియర్ కంపెనీలో పని చేస్తుండేవారు. వారి పరిచయం కాస్తా ప్రేమగా మారింది. కొన్నాళ్ల పాటు వారిద్దరూ సంతోషంగానే ఉన్నారు. ఏం జరిగింతో తెలియదు కానీ ఇటీవల హర్జిందర్ సింగ్‌కి డింపుల్ బ్రేకప్ చెప్పింది. ప్రేమ విఫలం కావడంతో తట్టుకోలేక పోయిన ప్రియుడు.. డింపుల్ ప్రేమను తిరిగి పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశాడు. ఆమెను పదేపదే కలిసేందుకు యత్నించాడు. అతని ప్రేమను ఒప్పుకునేందుకు డింపుల్ నిరాకరించడంతో హర్జిందర్ మానసికంగా కుంగిపోయాడు. దీంతో ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.

నిన్న (గురువారం) రాత్రి సమయంలో తాము పని చేస్తున్న ఆఫీసుకి కత్తితో వెళ్లాడు హర్జిందర్ సింగ్. కుర్చీలో కూర్చొన్న డింపుల్‌పై వెనుక నుంచి ఒక్కసారిగా దాడి చేయడం ప్రారంభించాడు. దీంతో యువతి తప్పించుకునేందుకు అక్కడి నుంచి పరుగులు తీసింది. అయినా వెంట పడి మరీ పలుమార్లు కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. ఇది గమనించిన తోటి ఉద్యోగులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అతన్ని ఆపేందుకు కొంత మంది యువకులు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, వారిపైనా కత్తి దూసేందుకు యత్నించాడు హర్జిందర్. అప్పటికే కుప్పకూలిపోయిన డింపుల్ మెడ, ముఖం, కడుపు భాగాల్లో మళ్లీ పలుమార్లు పొడిచాడు.

ఈ దాడిని ఆపేందుకు మరో యువకుడు కత్తితో రావడంతో నిందితుడు వెనక్కి తగ్గాడు. అనంతరం కత్తితో తన గొంతులో తానే పలుమార్లు పొడుచుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇది చూసి అక్కడున్న వారంతా తీవ్ర భయాందోళనకు గురి కాగా.. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కలకలం రేపుతున్నాయి. ఉద్యోగుల సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. డింపుల్, హర్జిందర్‌లను చికిత్స కోసం ఫోర్టిస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ డింపుల్ మరణించినట్లు వైద్యులు నిర్ధారించగా.. హర్జిందర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

# పట్టణాలకు హరిత కవర్ : రూఫ్ గార్డెనింగ్

**(06 జూన్ "వరల్డ్ గ్రీన్ రూఫ్ డే" లేదా "ప్రపంచ హరిత పైకప్పు దినోత్సవం" సందర్భంగా)**

పర్యావరణ విధ్వంసం కొనసాగుతోంది. భూమాతను కాలుష్య భూతం చుట్టేస్తున్నది. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమాత ఊపిరులను ఆపేస్తున్నాయి. భూమాతకు ప్రకృతి కట్టిన హరిత చీరలు పలుచబడుతున్నాయి. అడవులు తరిగి పోతున్నాయి. కార్చిచ్చులు కమ్మేస్తున్నాయి. గాలి కాలుష్యం ఊపిరితిత్తులను బాధిస్తోంది. నేలంతా నిస్సారమై ఎడారీకరణకు దారులు పడుతున్నాయి. జల వనరులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండుతున్నాయి. ఇలాగే నేటి తరం నిర్లక్ష్యం చేస్తే రేపటి తరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని మరిచిపోతున్నాం. మనం చేయవలసిన చిన్న చిన్న పర్యావరణ హిత చర్యలకు శ్రీకారం చుడదాం. మన ఇంటిని కూడా హరిత చీరలతో కప్పేద్దాం. ఇంటి ముందు లేదా ఇంటి వెనక లేదా పైకప్పు (రూఫ్)ను కూడా మొక్కలు నాటి మన గృహాన్ని నందనవనంగా మార్చడానికి కార్యాచరణ మొదలు పెడదాం.

రూఫ్ గార్డెనింగ్‌తో బహుళ ప్రయోజనాలు:

ప్రతి ఒక్క గృహ యజమాని విధిగా తన ఇంటి పైకప్పు ప్రాంతంలో మొక్కలు నాటి బహుళ ప్రయోజనాలు పొందాలనే అవగాహన కలిపించడానికి ప్రతి ఏట 06 జూన్ రోజున "ప్రపంచ హరిత పైకప్పు దినం" లేదా "వరల్డ్ గ్రీన్ రూఫ్ డే"ను పాటించుట ఆనవాయితీగా మారింది. 05 జూన్ రోజున ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్న వేళ మరుసటి రోజుననే ప్రపంచ హరిత పైకప్పు దినం రావడం విశేషంగా గుర్తు చేసుకోవాలి. 2026 ప్రపంచ హరిత రూఫ్ దినోత్సవం ఇతివృత్తంగా "ప్రకృతి లేదా నేచర్" అనే అంశాన్ని తీసుకొని పట్టణ ప్రాంతాల్లో హరిత క్షేత్రాలు, జీవ వైవిధ్యం, జీవ వ్యవస్థల పునరుజ్జీవనం గూర్చి ప్రచారం చేయడం జరుగుతోంది. రూఫ్ గార్డెనింగ్‌తో వాతావరణ ప్రతికూల మార్పులను అరికట్టడం, పట్టణాల్లో ఉష్ణోగ్రతలను తగ్గించడం, ఇల్లంతా చల్లదనం ఆవహించడం, పలు రకాల జీవులను ఆవాసాలు ఏర్పడడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం, ఇళ్లు సౌందర్యంగా మారి మానసిక ఉల్లాసం కలగడం, కూరగాయలు లేదా పండ్లు లేదా పూల మొక్కలతో ఆర్థిక వెసులుబాటు కలగడం,కార్బన్ ఉద్గారాల తగ్గడంతో భూతాప అదుపుకు మార్గం సుగమం కావడం, గాలి నాణ్యత పెరగడం, ఎక్కువైన నీటిని తీసుకోవడం, దుమ్ము దూళిని అడ్డుకోవడం, గార్డెనింగ్ పనులతో వ్యక్తిగత ఆరోగ్యం పరిరక్షించ బడడం, కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకోవడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి.

ఇప్పటికే తమ ఇంటి పైకప్పుల్లో మొక్కలు నాటిన వారు మరింత శ్రద్ధ తీసుకోవాలని, మొదలు పెట్టని వారు నేడే రూఫ్ గార్డెనింగ్ పనులకు శ్రీకారం చుట్టాలని కోరుకుందాం. మన ఇంటి పైకప్పు లేదా రూఫ్‌ను హరిత చీరలతో కప్పేద్దాం. గృహ నిర్మాణ సమయంలోనే రూఫ్ గార్డెనింగ్‌కు అనుకూలంగా నిర్మాణాలు చేపడదాం. మన ఇంటిని నందనవనంగా మార్చుకుందాం. మన ఇంట్లోనే ఆరోగ్యకర కూరగాయలు/పండ్లు/పూలను పండిద్దాం. ప్రతి రోజు మన ఇంటి పైకప్పులో ఉన్న మొక్కలతో ముచ్చట పెడదాం, మానసిక ఆనందాన్ని పొందుదాం, ఇరుగు పొరుగుకు ఆదర్శంగా నిలుద్దాం.



-మధుపాళీ
9949700037

# గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో తొలి ప్రపంచ యోగాసన పోటీలకు ప్రధానమంత్రి శ్రీకారం

న్యూఢిల్లీ, జూన్ 5 ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించే తొలి 'ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ- "అంతర్జాతీయ క్రీడా చరిత్రలో అహ్మదాబాద్ గడ్డపై నేడొక కొత్త అధ్యాయం ఆవిష్కృతమవుతోంది" అన్నారు.

ఈ చారిత్రక పోటీలలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను స్వాగతిస్తూ, ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి అహ్మదాబాద్ ఆతిథ్యం ఇస్తుండటం తనకెంతో ఆనందాన్నిస్తోందని ప్రధానమంత్రి చెప్పారు. "యునెస్కో ప్రపంచ వారసత్వ నగరాల్లో అహ్మదాబాద్ కూడా ఒకటి. భారత్‌లోని ఇలాంటి చారిత్రక నగరంలో ఈ కార్యక్రమ నిర్వహణ యావద్దేశానికీ గర్వకారణం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ప్రపంచవ్యాప్త యోగా వేదుకల సంగమాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ- మరో పక్షం రోజుల్లో జూన్ 21న వివిధ దేశాల్లో 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' (ఐడీవై) నిర్వహించనున్న నేపథ్యంలో ప్రధాన కార్యక్రమాన్ని మన దేశంలోని మరొక చారిత్రక నగరం కోల్‌కతాలో నిర్వహిస్తామని ప్రధానమంత్రి ప్రకటించారు. "అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందు ఆరోగ్యం, శ్రేయస్సును ద్విగుణీకృతం చేస్తూ 'ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్' ఇవాళ శ్రీకారం చుట్టుకుంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

అంతర్జాతీయంగా యోగాకు ప్రాచుర్యం కల్పించే దిశగా భారత్ కృషిని గుర్తుచేస్తూ- ఈ ప్రాచీన భారతీయ సంప్రదాయాన్ని మానవాళి ఆరోగ్యం-సామూహిక శ్రేయస్సుతో అనుసంధానించాలని తలపెట్టినట్లు పేర్కొన్నారు. ఈ లక్ష్యంతో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ కోసం ఓ రోజును నిర్ణయించాలని దాదాపు దశాబ్దం కిందట ఐక్యరాజ్య సమితిలో భారత్ ఒక ప్రతిపా దనను సమర్పించిందని చెప్పారు. "ఆనాడు 190 దేశాలు మన ప్రతిపాదనకు మద్దతిచ్చాయి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా నేడు యోగాకు ప్రజాదరణ ఇనుమడిస్తుండటంపై హర్షం వ్యక్తం చేస్తూ- ఈనాడు లక్షలాది ప్రజానీకం యోగాను దైనందిన జీవనంలో భాగం చేసుకోవడం ఎంతో ఆనందాన్నిస్తోందని చెప్పారు. ధ్యాన్యం, ప్రాణాయామం జీవనశైలిలో అంతర్భాగంగా మారుతోందని తెలిపారు. ప్రతి సజీవ సంప్రదాయ పరిణామ స్వభావాన్ని స్పష్టం చేస్తూ- సమకాలీన ఔచిత్యంతో యోగా నేడొక పరిణామాత్మక దశలో ప్రవేశించడాన్ని ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్ సూచిస్తున్నదని ఆయన అభివర్ణించారు. యోగాను గుర్తింపు పొందిన స్పర్ధాత్మక క్రీడగా నిలపడంలో ఈ పోటీల ప్రాధాన్యాన్ని వివరిస్తూ, భవిష్యత్తులో ఇది అగ్రశ్రేణి ప్రపంచ క్రీడా స్పర్ధలలో భాగం కాగలదని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు "ఈ పోటీల ద్వారా యోగాభ్యాసానికి ఒక స్పర్ధాత్మక క్రీడగా గుర్తింపు లభిస్తుంది. భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడలు లేదా ఇతర బహుళ క్రీడా పోటీలలో గానీ, అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలలో యోగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగలదని నా దృఢ విశ్వాసం" అని ఉద్ఘాటించారు.

ఈ క్రమంలో అహ్మదాబాద్ మార్గదర్శక పాత్రను ప్రస్తావిస్తూ- యోగాభ్యాసానికి ప్రపంచ ప్రధాన క్రీడలలో ఒకటిగా గుర్తింపు లభించే దిశగా ఈ తొలి ఛాంపియన్‌షిప్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచంలో వివిధ రంగాలు, వాటిలో అందివస్తున్న అవకాశాలను ఆయన ప్రస్తావించారు. ఇదేవిధంగా యోగా ఒక క్రీడగా ఎదగడం ద్వారా విస్తృత ఆర్థిక, వృత్తిగత ప్రభావం చూపగలదన్నారు. ఈ మేరకు "యోగాసన క్రీడ విస్తరిస్తున్న కొద్దీ కొత్త అవకాశాలు అందివస్తాయి. తదనుగుణంగా క్రీడాకారులు, శిక్షకులు, క్రీడా శాస్త్రవేత్తలు, పరిశోధకులు సహా ఈవెంట్ మేనేజర్లకూ వృత్తిగత అవకాశాల దిశగా బాటలు వేస్తుంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవానికి "ఆరోగ్యకర వృద్ధాప్యం కోసం యోగా"ను ఇతివృత్తంగా నిర్ణయించినట్లు ప్రధానమంత్రి చెప్పారు. సమకాలీన ప్రపంచ ఆరోగ్య సమస్యలు, దీర్ఘాయువును ఆకాంక్షించే ఆధునిక ప్రజానీకానికి యోగా ఎంత ప్రధానమో ఆయన వివరించారు. ఈ మేరకు "నేటి తరం దీర్ఘాయురారోగ్యాలతో, చురుగ్గా జీవించే మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో యోగాభ్యాసం వారికెంతో అనువైనది" శ్రీ మోదీ అభిప్రాయపడ్డారు.

యోగాతో ఉభయతారక ప్రయోజనాలను ప్రస్తావిస్తూ- నేటి అనేక దుష్ప్రభావాల నుంచి అది మనను విముక్తం చేస్తుందన్నారు. దీంతోపాటు నామమాత్రపు ఖర్చుతో ఆరోగ్యకర జీవనశైలిని కొనసాగించేందుకు ఇంతకన్నా ఉత్తమమైనది మరొకటి లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు యోగా నివారణ శక్తిని యావత్ ప్రపంచం గ్రహించే విధంగా 'నిత్య యోగాభ్యాసం - వ్యాధులన్నీ దూరం' అనే తారకమంత్రాన్ని గుర్తుంచుకోవాలని శ్రీ మోదీ సూచించారు.

ఈ దార్శనికతను ఉన్నత శిఖరాలకు చేరుస్తూ కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ 'యోగా 365' పేరిట ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రధానమంత్రి చెప్పారు. ఈ ప్రపంచ యోగాసన పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులంతా ఈ సందేశాన్ని వారి దేశాలకు చేర్చాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. తదనుగుణంగా ఆయా దేశాల్లో 'యోగా 365'కు రాయబారులుగా వ్యవహరిస్తూ విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. "యోగాపై మీ విశ్వాసం, మీ అనుభవాలతో ప్రపంచాన్ని అనుసంధానించండి" అని ఉద్బోధించారు.

ప్రపంచ యోగాసన పోటీల్లో విజేతలు ఎవరన్నదానితో నిమిత్తం లేకుండా ఈ చారిత్రక ఘట్టంలో భాగస్వాములైన క్రీడాకారులందరికీ ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు. వారంతా నేటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలుపంచుకోవడం కూడా ఎంతో ప్రాధాన్యం గల అంశమేనని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల స్ఫూర్తిదాయక శక్తిని ప్రస్తావిస్తూ- వారి ప్రతిభ, క్రమశిక్షణ ప్రపంచవ్యాప్త యువతకు ఎనలేని ఉత్తేజాన్నిస్తాయని ప్రధానమంత్రి చెప్పారు.

ఈ మేరకు "మీ అంకిత భావం యావత్ ప్రపంచ యువతరాన్ని చైతన్యపరుస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

# చెట్లు నాటుదాం.. ప్రకృతిని కాపాడుకుందాం



అమరావతి, జూన్ 5:పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి లక్ష్యంగా మారాలని, చెట్లను నాటి వాటిని సంరక్షించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం జిల్లా అధ్యక్షుడు షణ్ముఖరావు పిలుపునిచ్చారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు మానవాళికి సవాళ్లుగా మారుతున్నాయని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు అధికంగా కాలుష్యాన్ని వెదజల్లుతూ, పేద దేశాలపై ఆంక్షలు విధించడం సమంజసం కాదన్నారు. యుద్ధాల కారణంగా కూడా పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొన్నారు.

దేశంలో హిమాలయ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు తీవ్ర వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. నంద్యాల జిల్లా పరిధిలో నల్లమల అడవులు క్రమంగా క్షీణిస్తుండటంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

చెట్లు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం ఆధ్వర్యంలో పేదలు నివసించే ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు, న్యాయవాది బి. శంకరయ్య, అబులైస్, రియాజ్, సీపీఐ నాయకుడు ప్రసాదు, గోపాల్, వెంకటేష్, కరీంభాషా, సంజీవరాయుడు, మురళీధర్, దర్శకుడు కోటేంద్రరావు, ఎండి రఫీ, లక్ష్మీదేవి, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# యోగా పండగకు సర్వం సిద్ధం..

**-15 రోజులపాటు నిర్వహణ.**
**-ఈ నెల 7న పోలీస్ థీమ్ యోగా కార్యక్రమం**
**-ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు**
**-విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో నిత్య యోగా**
**-ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి**
**-జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు**



విజయవాడ, జూన్ 5: స్వర్ణాంధ్ర-ఆరోగ్యాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 7 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవమైన 21వ తేదీ వరకు పండగలా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తుందని.. జిల్లాలోనూ ఊరువాడా యోగా కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ.. పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, అడిషనల్ సీపీ కేజీవీ సరిత, సమన్వయ శాఖల అధికారులతో కలిసి యోగాంధ్ర-2026పై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, ప్రతి ఇంటికి యోగాను చేరవేయడం, ప్రజల్లో నిత్య యోగా సాధన అలవాటును పెంపొందించే లక్ష్యంతో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 7న పోలీసు సిబ్బందితో బీఆర్‌టీఎస్ రోడ్డులో థీమాటిక్ యోగా, ఈ నెల 10న పవిత్ర సంగమం వద్ద, 13వ తేదీన బెర్మ్ పార్కు వద్ద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు నిత్య యోగా కార్యక్రమం జరుగుతుందని.. రైతులు, మహిళలు, యువత, వైద్యులు, కార్మికులు, విద్యార్థులు, క్రీడాకారులు, వయోవృద్ధులు, ఉపాధ్యా యులు..

ఇలా వివిధ వర్గాలకు ఇందులో భాగస్వాములను చేయనున్నట్లు వివరించారు. గ్రామాల్లో, వార్డుల్లో, దేవాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, మైదానాలు తదితర ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న జిల్లాస్థాయి కార్యక్రమం జరుగుతుందని.. జిల్లాలో 300 మంది మాస్టర్ ట్రైనర్లు, అయిదు వేల మందికిపైగా యోగా శిక్షకులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కృష్ణానది వెస్ట్‌బైపాస్ రోడ్డుపై రాష్ట్రస్థాయి కార్యక్రమం జరుగుతుందని.. ఇందులో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమాల్లో భాగస్వాములవుతారని.. ఇదేవిధంగా ప్రతిఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు గ్రామ/వార్డు స్థాయిలో యోగా ఫర్ ఆల్ ? గ్రాస్‌రూట్స్ వెల్‌నెస్ ఇతివృత్తంతో పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఔత్సాహికులు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విజేతలు మండల స్థాయికి, మండలస్థాయిలో విజేతలు జిల్లాస్థాయికి, అక్కడ విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు యునిటీ త్రో యోగా-బ్రిడ్జింగ్ కమ్యూనిటీస్ థీమ్‌తో మండల స్థాయిలో, ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు యోగా అండ్ యూత్ ? బిల్డింగ్ ఎ హెల్దీ ఫ్యూచర్ థీమ్‌తో జిల్లాస్థాయిలో, ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు యోగాంధ్ర-ఆంధ్రాస్ గ్లోబల్ యోగా షోకేజ్ థీమ్‌తో రాష్ట్రస్థాయి లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

వ్యక్తిగత కేటగిరీ (ఆసన, ప్రాణాయాయ ప్రదర్శనలు), గ్రూపు కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా పోటీలు ఉంటాయని.. అదే విధంగా యోగా క్విజ్, యోగా స్లోగన్ పోటీలు కూడా నిర్వహించనున్నట్లు వివరించారు. జూనియర్ (10-18 ఏళ్లు), యంగ్ (19-35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సత్కరించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

మనిషికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమని.. నేర నియంత్రణకు, నేర రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను తీర్చిదిద్దేందుకు యోగా కూడా ఓ మంచి మార్గమని పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. డ్రగ్స్‌పై దండయాత్ర 2.0ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఇందులో గుర్తించిన గంజాయి పాజిటివ్స్‌కు కూడా 28 పోలీస్ స్టేషన్ల పరిధిలో యోగా కార్యక్రమాలు, శిబిరాలు నిర్వహించి మంచి మార్గంలో నడిచేలా, జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాలో పోలీస్ థీమ్ యోగాకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని సీపీ రాజశేఖరబాబు పేర్కొన్నారు.

జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని మాట్లాడుతూ ఈ ఏడాది ఆరోగ్యవంతమైన వృద్ధాప్య జీవనానికి యోగా థీమ్‌తో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. జీవితంలో ఏ సంక్షోభం ఎదురైనా ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనే సామర్థ్యం ఉండాలంటే శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక ఆరోగ్యం ఉండాలని, అదే నిజమైన ఆరోగ్యమని పేర్కొన్నారు. ఆయుష్, వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, పోలీస్, యువజన సంక్షేమం, క్రీడలు, విద్య, పంచాయతీరాజ్, మునిసిపల్ ఇలా వివిధ శాఖల సహకారంతో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు రత్నప్రియదర్శిని తెలిపారు.

# బాపట్ల పోలీసులకు మరిన్ని సౌకర్యాలు..

**-పెట్రోల్ బంక్, క్యాంటీన్ ఏర్పాటుకు ఎస్పీ గ్రీన్ సిగ్నల్**



అమరావతి, జూన్ 5:బాపట్ల జిల్లా ఏఆర్, ఎంటీ కార్యాలయాలను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భం గా సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ, కార్యాలయాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఏఆర్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలీస్ పెట్రోల్ బంక్‌కు అనువైన ప్రదేశాన్ని, అలాగే పోలీస్ సబ్సిడీ క్యాంటీన్ ఏర్పాటుకు అనుకూలమైన స్థలాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

అలాగే మహిళల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన శక్తి రెస్ట్ రూమ్స్ ఫర్ ఉమెన్ బస్సును కూడా ఎస్పీ పరిశీలించి, అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. పోలీసు సంక్షేమం, సౌకర్యాల మెరుగుదల కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బాపట్ల డిఎస్పి సిహెచ్ చంద్రమౌళి, ఏ ఆర్ డి ఎస్ పి వెూయిున్, ఎడ్మిన్ ఆర్ ఐ మౌలిద్దీన్, ఎన్ బి సి ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తొలి జేడీసీ సమావేశంలో ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని మరింత పెంపొందించుకోవడం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించిన భారత్, జింబాబ్వే

న్యూ ఢిల్లీ, జూన్ 5:భారత్-జింబాబ్వే సంయుక్త రక్షణ కమిటీ (జేడీసీ) ప్రారంభ సమావేశం ఈ రోజు న్యూఢిల్లీలో జరిగింది. శిక్షణ, మద్దతు, ఉమ్మడి వాయు ఆస్తుల నిర్వహణ వంటి రంగాల్లో ప్రస్తుత సహకారాన్ని మరింత విస్తరించడం ద్వారా ద్వైపాక్షిక రక్షణ సంబంధాలను పెంపొందించుకోవడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. సమష్టి తయారీ, ఉగ్రవాద నిరోధం, సరిహద్దు నిర్వహణ, శాంతి పరిరక్షణ వంటి కొత్త రంగాల్లో సహకారానికి గల మార్గాలనూ వారు చర్చించారు.

ఈ సమావేశానికి భారత్ తరపున సంయుక్త కార్యదర్శి శ్రీ అమితాబ్ ప్రసాద్, రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌లో పర్యటిస్తున్న 12 మంది సభ్యుల ఉన్నత స్థాయి ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న జింబాబ్వే శాశ్వత కార్యదర్శి శ్రీ ఆరోన్ డేనియల్ టోండే నెపెరాలు సహ-అధ్యక్షత వహించారు. భారత ప్రతినిధి బృందంలో సర్వీసెస్, రక్షణ ఉత్పత్తుల విభాగం, సాయుధ దళాల వైద్య సేవల ప్రతినిధులు ఉన్నారు.భారత్-జింబాబ్వే మధ్య రక్షణ భాగస్వామ్యం క్రమంగా బలపడుతోంది. ఏరో ఇండియా-2025 సందర్భంగా ఇరు దేశాల రక్షణ మంత్రులు సంతకం చేసిన రక్షణ సహకార అవగాహన ఒప్పందంలో నిర్దేశించిన లక్ష్యాలను కార్యాచరణలోకి తీసుకురావడం ద్వారా... ఈ తొలి జేడీసీ సమావేశం ఈ సంబంధాలను మరింత బలోపేతం చేసింది.జింబాబ్వే ప్రతినిధి బృందం న్యూఢిల్లీలోని డీపీఎస్‌యూ భవన్‌నూ సందర్శించింది. అక్కడ వారు భారత రక్షణ రంగ ప్రతినిధులతో పరస్పర సహకారానికి గల అవకాశాలపై చర్చించారు. శ్రీ ఆరోన్ డేనియల్ టోండే నెపెరా న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, అమరవీరులకు నివాళులర్పించడం ద్వారా తమ పర్యటనను ప్రారంభించారు.

# ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో రెండో బ్రిక్స్ సాంస్కృతిక కార్యాచరణ బృందం సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 5:(బ్రిక్స్ సభ్య దేశాల భాగస్వామ్యంతో రెండో బ్రిక్స్ సాంస్కృతిక కార్యాచరణ బృందం (సీడబ్ల్యూజీ) రెండు రోజుల సమావేశాలు ఈరోజు ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ సమావేశానికి భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వివేక్ అగర్వాల్ అధ్యక్షత వహించారు. బ్రెజిల్, చైనా, ఇండోనేషియా, ఇరాన్, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధులు స్వయంగా హాజరుకాగా, ఇథియోపియా, ఈజిప్ట్ రష్యన్ ఫెడరేషన్ ప్రతినిధులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్య దేశాలు ఎజెండాలోని అంశాలపై తమ ప్రాధాన్యతలను, దృక్పథాలను పంచుకున్నాయి.

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ, ప్రజల మధ్య సహకారం: ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు భవిష్యత్తు కార్యాచరణ అనే ఇతివృత్తంతో జరిగిన మొదటి ప్యానెల్ చర్చకు భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వివేక్ అగర్వాల్ సమన్వయకర్తగా వ్యవహరించారు. సమ్మేళిత అభివృద్ధి, సామాజిక సామరస్యం, సాంస్కృతిక మార్పిడి, మార్కెట్ లభ్యత, డిజిటల్ ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ పాత్రపై ఈ చర్చ ప్రధానంగా దృష్టి సారించింది.

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో కాపీరైట్, నైతిక విలువల ఆధారిత కృత్రిమ మేధ, ఉత్తమ పద్ధతులను పెంపొందించడం అనే ఇతివృత్తంతో జరిగిన రెండవ ప్యానెల్ చర్చకు ఐజీఎన్‌సీఏ సభ్య కార్యదర్శి డాక్టర్ సచ్చిదానంద్ జోషి సమన్వయకర్తగా వ్యవహరించారు. సృజనాత్మక రంగంలో కాపీరైట్ పరిరక్షణ, సాంస్కృతిక గుర్తింపు, కృత్రిమ మేధ ) వినియోగానికి సంబంధించిన నైతిక అంశాల ప్రాధాన్యతను ఈ చర్చలు ప్రముఖంగా ప్రస్తావించాయి. బ్రిక్స్ దేశాల మధ్య భవిష్యత్తు సహకారానికి ఉన్న అవకాశాలను కూడా ఇందులో అన్వేషించారు.

భారత సుసంపన్నమైన, విభిన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంతో ఈ సమావేశాలు ముగిశాయి. దేశంలోని వివిధ ప్రాంతాల విశిష్ట సంగీత సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రదర్శించిన సంగీత సమ్మేళనం భారత సాంస్కృతిక వైవిధ్యాన్ని, ఐక్యతను ఆవిష్కరించింది. కలర్స్ ఆఫ్ ఇండియా పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రకాల శాస్త్రీయ, జానపద నృత్య రూపాలను ప్రదర్శిస్తూ ఒక శక్తివంతమైన సాంస్కృతిక ప్రదర్శనను కూడా ఏర్పాటు చేశారు. ఇది భారత సంపన్న కళా సంప్రదాయాలను సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతినిధులకు కళ్లకు కట్టినట్లు చూపించింది.

ఈ సమావేశం 2026 జూన్ 5న కూడా కొనసాగుతుంది. ఇందులో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య సాంస్కృతిక సహకారానికి సంబంధించిన ప్రాధాన్యతా రంగాలపై మరింతగా చర్చిస్తారు.

# ఇండియా-యూకే కీలక ఖనిజాల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ అబ్జర్వేటరీని ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి, యూకే విదేశాంగ కార్యదర్శి ఇవెట్ కూపర్

న్యూఢిల్లీ, జూన్ 5:ఈ రోజు న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్ రెడ్డి, బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి, కామన్వెల్త్, అభివృద్ధి వ్యవహారాల మంత్రి ఇవెట్ కూపర్ భారత్–యూకే కీలక ఖనిజాల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల అబ్జర్వేటరీ (జీఎస్‌సీవో)ను అధికారికంగా ప్రారంభించారు.

కీలకమైన ఖనిజాలు, సరఫరా వ్యవస్థల స్థిరత్వంలో భారత్–యూకే భాగస్వామ్యం సాధిస్తున్న వృద్ధిని ఈ ఘట్టం సూచిస్తుంది అలాగే, స్వచ్ఛ ఇంధన స్వీకరణ, అధునాతన తయారీ, విద్యుత్ వాహన రంగం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలకు అవసరమైన వనరులను పొందడంలో సహకారాన్ని బలోపేతం చేస్తుంది. ఈ కార్యక్రమానికి భారత గనుల మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు, యునైటెడ్ కింగ్‌డమ్‌లో భారత హై కమిషన్ కార్యాలయ ప్రతినిధులు, యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు, భారత్‌లో బ్రిటన్ హైకమిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. వీరితో పాటుగా టెక్స్‌మిన్, ఐఐటీ (ఐఎస్‌ఎం)–ధన్‌బాద్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ ప్రతినిధులు, రెండు దేశాలకు చెందిన పారిశ్రామిక, విద్య, పరిశోధన సంస్థల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కీలక ఖనిజాలను ఆధునిక ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, శుద్ధ ఇంధన సాంకేతిక పరిజ్ఞానాలు, విద్యుత్ వాహన రంగం, వ్యూహాత్మక రంగాల్లో ఆవశ్యకమైనవిగా కిషన్ రెడ్డి వర్ణించారు. ఈ అబ్జర్వేటరీ.. కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థ నిఘాలో భారత దేశ సామర్థ్యాలను బలోపేతం చేస్తుందని, సాక్ష్యం ఆధారిత విధాన రూపకల్పనకు తోడ్పాటు అందిస్తుందని, జాతీయ కీలక ఖనిజాల కార్యక్రమం (ఎన్‌సీఎంఎం) లక్ష్యాలను ముందుకు తీసుకెళుతుందని మంత్రి తెలియజేశారు.

విశ్వసనీయ భాగస్వాములతో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందిస్తూనే.. స్థిరమైన, వైవిధ్యమైన కీలక ఖనిజ విలువ ఆధారిత వ్యవస్థలను నిర్మించడంలో భారతదేశ నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

దృఢమైన, వైవిధ్యమైన, సుస్థిరమైన కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో భారత్–యూకే సహకారానికున్న ప్రాధాన్యాన్ని యూకే విదేశాంగ కార్యదర్శి ఇవెట్ కూపర్ స్పష్టం చేశారు. రెండు దేశాల పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా కీలక ఖనిజాలను విస్తృతంగా అందుబాటులోకి రావాలని, సమాచార వినిమయం మెరుగవ్వాలని అన్నారు. ఇవి ఆర్థిక వృద్ధికి, సరఫరా వ్యవస్థ భద్రతకు గణనీయంగా దోహదపడగలవని ఆమె చెప్పారు

కీలక ఖనిజాల రంగం, సంబధిత వ్యూహాత్మక పరిశ్రమల్లో విస్తృత సహకారానికి పునాదిగా పనిచేసే సామర్థ్యం ఈ భాగస్వామ్యానికి ఉందని ఆమె వెల్లడించారు.

టెక్స్‌మిన్ (టీటీఆర్‌పీ, డీఎస్‌టీ, జీవోఐ), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఎస్‌ఎం) ధన్‌బాద్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ అబ్జర్వేటరీని ఏర్పాటు చేశాయి. అంతర్జాతీయ కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థల పర్యవేక్షణకూ, విశ్లేషణకూ డేటా ఆధారిత వేదికను రూపొందించడమే దీని లక్ష్యం.

2025 అక్టోబరులో భారత్–యూకే ప్రధానమంత్రుల ద్వైపాక్షిక సమావేశాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు. అనంతరం 2026 మార్చిలో కుదిరిన పరిశోధనా సహకార ఒప్పందం ద్వారా దీనిని కార్యాచరణలోకి తీసుకు వచ్చారు.

భారత దేశ జాతీయ కీలక ఖనిజాల మిషన్, యూకే సాంకేతిక భద్రతా పథకం పరిధిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికున్న ప్రాధాన్యం గురించి ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్ డైరెక్టర్, టెక్స్‌మిన్ గవర్నింగ్ బోర్డు ఛైర్మన్ అయిన ప్రొఫెసర్ సుకుమార్ మిశ్రా వివరించారు.

ఈ అబ్జర్వేటరీకి సంబంధించిన సమాచారాన్ని టెక్స్‌మిన్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం సంయుక్తంగా వివరించాయి. అంతర్జాతీయ కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థల పర్యవేక్షణ, సరఫరాలో ముప్పులు, అవాంతరాల గుర్తింపు, మార్కెట్ ఇంటిలిజెన్స్‌ను రూపొందించడంతో పాటు విధాన రూపకర్తలకు, పరిశ్రమలకూ, పరిశోధకులకు సమాచారంతో కూడిన నిర్ణయాలను తీసుకొనే వీలును ఈ వేదిక కల్పిస్తుంది.

కీలకమైన ఖనిజాల రంగంలో భారత్–యూకే మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికీ, దృఢమైన, సురక్షితమైన, స్థిరమైన అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలకు సంబంధించి సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికీ మద్దతు ఇచ్చేందుకు విలువైన వేదికగా ఈ కార్యక్రమం పని చేస్తుందని భావిస్తున్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం..



నల్గొండ, జూన్ 5: మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) నాగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై సుబ్బారావు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగాఎంపీడీఓ నాగేష్ మాట్లాడుతూ పూర్వకాలంలో చెట్లు, అడవులు అధికంగా ఉండటంతో సమృద్ధిగా వర్షాలు కురిసేవని, ప్రస్తుతం చెట్ల నరికివేత పెరగడం వల్ల వర్షపాతం తగ్గి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి కుటుంబం కనీసం పది మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

అలాగే ప్రతి గ్రామపంచాయతీలో మొక్కల పెంపకాన్ని విజయవంతం చేయడంలో గ్రామ కార్యదర్శులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కోరారు.

## గంజాయిపై ఉక్కుపాదం.. ఐదు నెలల్లో 23 మంది అరెస్ట్, 23 కేజీలకు పైగా స్వాధీనం

అమరావతి, జూన్ 5:జిల్లాలో యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, మత్తు పదార్థాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ హెచ్చరించారు. గంజాయి విక్రయాలు, రవాణా లేదా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.

శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, ఈ ఏడాది జనవరి నుంచి మే నెల వరకు జిల్లాలో మొత్తం 8 గంజాయి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో 23 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 23.193 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్న ఆయన, గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతూ విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

గంజాయి నిర్మూలనతో పాటు యువత వ్యసనాలకు బానిస కాకుండా ముందస్తు చర్యలు కూడా చేపడుతున్నామని ఎస్పీ వివరించారు. జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో పాఠశాలలు, కళాశాలలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు, యువత, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. యువత తమ బంగారు భవిష్యత్తును వ్యసనాల బారిన పడకుండా కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

గంజాయి రవాణా, విక్రయాలు లేదా యువతను వ్యసనాల వైపు ప్రోత్సహించే వారిపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేయడానికీ వెనుకాడబోమని స్పష్టం చేశారు.

జిల్లాలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ సునీల్ షొరాణ్ తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణే భారతీయ సంస్కృతి

## –జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, జూన్ 5: సమాజంలోని ప్రతి వ్యక్తి ప్రకృతి, పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించి ఆచరణలో పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్



కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గుడిపాల మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటి, విద్యార్థులు, ప్రజలకు సీడ్ బాల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి వ్యక్తిగత కర్తవ్యమని పేర్కొన్నారు. మొక్కలను పెంచి పచ్చదనాన్ని విస్తరించే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఉద్యమంలా చేపట్టాలని సూచించారు.

ప్రకృతి తల్లిలాంటిదని, చెట్లు సమస్త ప్రాణికోటికి జీవనాధారమని చెప్పారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పచ్చదనంతో నింపడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం భాగస్వామ్యంతో సామాజిక అడవుల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తూ ఒకవైపు ఉపాధి అవకాశాలు కల్పిస్తూనే మరోవైపు పచ్చదనాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాల్లో కనీసం కొన్ని మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని సూచించారు.

యువత మొక్కల పెంపకాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని, తాము నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో తీసుకుంటోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రాన్ని హరితాభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఎండలు, వడగాలులు, అకాల వర్షాలు, తుఫానులు, సునామీలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలకు భూతాపం పెరగడం, వాతావరణ అసమతుల్యతలు ప్రధాన కారణాలని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వినియోగించడం, అడవుల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం అధికమవడం వంటి చర్యలు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణే భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్న కలెక్టర్, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్ఓ) సుబ్బరాజు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఎం. పట్టాభి, థామస్ సుకుమార్, ఎన్. బాలకృష్ణరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కరణ్ సింగ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హరిబాబు, అటవీశాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# రెండేళ్లు పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన

న్యూ ఢిల్లీ, జూన్ 5:ప్రధాన మంత్రి సూర్యఘర్ – ముఫ్త్ బిజ్లీ యోజన రెండేళ్లలోనే 40 లక్షలకు పైగా లబ్ధిదారుల కుటుంబాలకు చేరిందని, 2026 డిసెంబరు నాటికి 75 లక్షలకు పైగా కుటుంబాలకు చేరుతుందని ఆశిస్తున్నామని కేంద్ర నూతన-పునరుత్పాదక ఇంధనం, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి అన్నారు. 'రెండేళ్ల ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ? సౌర విద్యుత్ గృహాలను కోటి పైకప్పులకు విస్తరించడం' అనే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు నిర్వహించిన ఫైర్‌సైడ్ చాట్ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ముఖ్యంగా వెనకబడిన కుటుంబాల్లో పథకం అమలును వేగవంతం చేయడానికి యుటిలిటీ-లింక్డ్ అగ్రిగేషన్ (యూఎల్ఏ) నమూనాను రూపొందించినట్లు శ్రీ జోషి తెలిపారు. ఈ నమూనా కింద రాష్ట్రాల వ్యాప్తంగా సుమారు 30 లక్షల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించామని, వీటిని వేగంగా స్వీకరించి, అమలు చేయడంలో యుటిలిటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యంగా 1 కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించే కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తుందని, సరసమైన పరిశుద్ధ ఇంధనం విస్తృతంగా అందుబాటులో ఉండేలా నిర్ధారించడంలో సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 65 లక్షలకు పైగా దరఖాస్తులు పరిశీలనలో ఉండగా... ఈ పథకం దేశవ్యాప్తంగా బలమైన ప్రజా భాగస్వామ్యం, అపూర్వమైన వేగంతో ముందుకు సాగుతోందని శ్రీ జోషి తెలిపారు.

భారత సౌర విద్యుత్ వృద్ధి వేగంగా పుంజుకుంటోందని కేంద్ర మంత్రి అన్నారు. మొదటి 50 గిగావాట్ల సామర్థ్యానికి 96 నెలలు పట్టిందని, ఆ తర్వాతి 50 గిగావాట్లకు 36 నెలలు, 100 గిగావాట్ల నుంచి 150 గిగావాట్లకు వృద్ధి చెందడానికి కేవలం 14 నెలలు మాత్రమే పట్టిందని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ప్రారంభించినప్పటి నుంచి మే 2026 అత్యంత బలమైన నెలగా నిలిచిందన్నారు. ఆ నెలలో రికార్డు స్థాయిలో 3.16 లక్షల రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారనీ, కేవలం ఒక్క రోజులోనే 15,000 గృహాలకు వీటిని జోడించారని కేంద్ర మంత్రి తెలిపారు.

లక్ష కుటుంబాలకు ఈ పథకాన్ని చేర్చడానికి 118 రోజుల సమయం పడుతుండగా... అది ప్రస్తుతం ఎనిమిది రోజుల కన్నా తక్కువ సమయానికి స్వయంచాలకంగా పెరిగిందని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు. 2026 మే నెలలోనే రూ. 2,743 కోట్లు సహా... మొత్తం రూ. 22,750 కోట్లకు పైగా సబ్సిడీలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. "పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన భారత పరిశుద్ధ ఇంధన పరివర్తనను, ఇంధన రంగంలో స్వయం-సమృద్ధిని ముందుకు తీసుకెళ్తూ... ప్రపంచంలోనే అతిపెద్ద గృహసంబంధిత సౌర విద్యుత్ మార్కెట్లలో ఒకదాన్ని సృష్టిస్తోంది'' అని శ్రీ జోషి పేర్కొన్నారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచం ఇంధన అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో... పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన వంటి కార్యక్రమాలు భారత ఇంధన భద్రతను, వ్యూహాత్మక సామర్థ్యాన్ని బలోపేతం చేస్తున్నాయని శ్రీ జోషి అన్నారు. ఈ పథకానికి ముందు నెలకు సుమారు 7000గా ఉన్న రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్‌లు... ప్రస్తుతం నెలకు మూడు లక్షలకు పైగా పెరిగాయని ఆయన తెలిపారు. 17 లక్షలకు పైగా కుటుంబాలు సున్నా విద్యుత్ బిల్లులను సాధించాయని, ఇది కుటుంబాలకు కలిగిన ప్రత్యక్ష పొదుపును స్పష్టంగా చూపిస్తోందని కేంద్ర మంత్రి శ్రీ జోషి తెలిపారు. 2047 నాటికి ప్రతి ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెళ్లు ఉంటాయని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు. "పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ప్రజా ఉద్యమంగా మారుతోంది" అని ఆయన అన్నారు. భవిష్యత్తులో నిల్వ ఖర్చులు తగ్గుతున్న కొద్దీ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లనూ అనుసంధానిస్తామని, మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం ద్వారా వీటి వినియోగాన్ని విస్తరిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.

నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ కార్యదర్శి శ్రీ సంతోష్ కుమార్ సారంగి, ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రూ. 75,021 కోట్ల వ్యయంతో 13 ఫిబ్రవరి 2024న ప్రారంభించిన 'పీఎం సూర్య ఘర్ – ముఫ్త్ బిజ్లీ యోజన' ప్రపంచంలోనే అతిపెద్ద గృహ రూఫ్‌టాప్ సోలార్ కార్యక్రమంగా అవతరించింది. 2026 మే నెల నాటికి, కోటికి పైగా కుటుంబాలు జాతీయ పోర్టల్‌లో నమోదు చేసుకోగా... 33 లక్షలకు పైగా రూఫ్‌టాప్ వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. దీని ద్వారా 12 గిగావాట్లకు పైగా సామర్థ్యాన్ని జోడించారు. ప్రస్తుతం గృహ సౌర విద్యుత్ సామర్థ్యంలో రూఫ్‌టాప్ సోలార్ వాటా దాదాపు 45 శాతంగా ఉంది. 2024-2026 మధ్యకాలంలో దీని విస్తరణ వృద్ధి 85 శాతానికి పెరిగింది. 2026 మార్చి నెల నాటికి మొత్తం సౌర విద్యుత్ సామర్థ్యం 150 గిగావాట్లను దాటడంతో... 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్య లక్ష్యాన్ని సాధించే దిశగా భారత్ సాధిస్తున్న ప్రగతికి ఈ పథకం దోహదపడుతోంది. ఇది ఇంధన లభ్యతను పెంచుతూనే, డిస్కమ్‌ల పై సబ్సిడీ భారాన్నీ తగ్గిస్తుంది.

పీఎం సూర్య ఘర్ లోగో, వాట్సాప్ బాట్‌నూ శ్రీ జోషి ప్రారంభించారు. 2026 మే నెలలో నిర్వహించిన "సౌర ఇంధన మాసం" ప్రచారంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారితో సహా... అగ్రస్థానంలో నిలిచిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, డిస్కమ్‌లు, బ్యాంకులు, విక్రేతలు, ఇతర భాగస్వాములకు పీఎం సూర్య ఘర్ పురస్కారాలను ప్రదానం చేశారు.

# ఫేస్ అథెంటికేషన్ ప్రోటోకాల్‌ను రూపొందించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

న్యూ ఢిల్లీ, జూన్ 5:పరీక్షల నిర్వహణ ప్రక్రియలో నైతికతను పెంచడంతో పాటు ఒక అభ్యర్థికి బదులుగా మరొకరు పరీక్ష రాయడాన్ని అడ్డుకొనే దిశగా 'ముఖ ప్రామాణికత' (ఫేస్ అథెంటికేషన్) ప్రక్రియను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) ఇటీవల జరిగిన సివిల్ సర్వీసులు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ప్రిలిమినరీ) పరీక్ష-2026లో విజయవంతంగా అమలు చేసింది. ఈ ఫేస్ అథెంటికేషన్ ప్రోటోకాల్ ఏ అభ్యర్థి ఫోటో దరఖాస్తు పత్రాన్ని నింపేటప్పుడు అప్‌లోడ్ అయిందో, అదే వ్యక్తి పరీక్ష రాయడానికి ప్రవేశ పత్రంతో వచ్చినట్లు నిర్ధారిస్తుంది. ఈ వ్యవస్థ పరీక్ష కేంద్రాల వద్ద పర్యవేక్షకులు మొబైల్ ఫోన్‌ను ఉపయోగించి అభ్యర్థులను ప్రత్యక్షంగా (లైవ్), వాస్తవ కాల ప్రాతిపదికన సరిచూసే పద్ధతిని నిర్ధారిస్తుంది. దీంతో ఎలాంటి ఇబ్బందులకూ తావు ఇవ్వని విధంగా గుర్తింపు సాధ్యపడుతుంది. ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయడానికి గాని, లేదా దుష్ప్రవర్తనకు పాల్పడేందుకు గాని అవకాశాలు ఉండనే ఉండవు. ఈ సంవత్సరం సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షల కాలంలో, యూపీఎస్‌సీ దేశవ్యాప్తంగా మొత్తం 2,072 పరీక్ష కేంద్రాల్లో వాస్తవిక కాలంలో ముఖ గుర్తింపు పద్ధతిని అమలుపరిచింది. ముఖ ప్రామాణికతకు సంబంధించిన ఈ అప్లికేషన్‌ను ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ ఈ-పరిపాలన డివిజన్ (ఎన్ఈజీడీ) అందించిన సాంకేతిక సహకారంతో యూపీఎస్‌సీ రూపొందించి, ఆచరణలో పెట్టింది.

పరీక్ష హాలులో అడుగు పెట్టడాని కన్నా ముందు ప్రతి ఒక్క అభ్యర్థి తన ముఖాన్ని సరిచూపించుకొని, తనే సిసలైన అభ్యర్థినని నిర్ధారించుకోవడం యూపీఎస్‌సీ అభివృద్ధి చేసిన కార్య ప్రణాళిక ప్రకారం తప్పనిసరి అయిపోయింది. యూపీఎస్‌సీ ఈ ప్రక్రియలో భాగంగా, ఒక విస్తృత ఎస్ఓపీని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) కూడా రూపొందించింది. దీనిని అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, పరీక్షా కేంద్రాలతో పంచుకున్నారు. పర్యవేక్షకులకు అనేక దశలలో శిక్షణను ఇచ్చారు. దీని అమలుకు ఏ ఖరీదైన హార్డ్‌వేర్‌తోనో అవసరం పడక పోవడమే ఈ పరిష్కారంలో అన్నింటి కన్నా గొప్పగా చెప్పుకోవాల్సిన విషయం.

# అందరూ మొక్కలు నాటాలి, పర్యావరణాన్ని కాపాడాలి

## –అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల

నల్గొండ, జూన్ 5:పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది అని అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని



జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి తమ తమ పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్కను నాటాలని వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ బొట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సృజన కుమారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పి. శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

# ముడిచమురు దిగుమతి తగ్గింపు నుంచి రైతు సౌభాగ్యం దాకా: ఢిల్లీలో తొలి మిశ్రమ ఇంధన ప్రయాణిక వాహనం ఆవిష్కరణ




న్యూఢిల్లీ, జూన్ 5:స్వయం సమృద్ధ భారత్ దార్శనికతకు మరింత ఉత్తేజమిస్తూ కేంద్ర పెట్రోలియం-సహజ వాయువుల శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరి ఇవాళ న్యూఢిల్లీలో మారుతి సుజుకి సంస్థ రూపొందించిన భారత తొలి మిశ్రమ ఇంధన (ఫ్లెక్స్-ఫ్యూయల్) ప్రయాణిక వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణా -రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ కూడా పాల్గొన్నారు. ఈ వాహనాలు 'ఇ20' నుంచి 'ఇ100' వరకూ వివిధ రకాల ఇథనాల్-పెట్రోల్ మిశ్రమంతో నడవగలవు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- మిశ్రమ ఇంధన సాంకేతికతతో రూపొందించిన ప్రయాణిక వాహన ప్రారంభోత్సవం ఒక విస్తృత ఉత్పత్తి మార్కెట్ ప్రవేశానికి పరిమితం కాదని, దేశ ఇంధన రూపాంతరీకరణలో ఇదో కొత్త అధ్యాయమని అభివర్ణించారు. దేశంలోని దాదాపు 37 లక్షల ప్రయాణిక వాహనాలు మధ్యతరగతి ఆకాంక్షలకు, వ్యక్తిగత ప్రయాణ భవిష్యత్తుకు ప్రతీకగా నిలుస్తున్నాయని శ్రీ పూరి గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో మిశ్రమ ఇంధన సాంకేతికతను విస్తృతంగా అనుసరించడం ద్వారా ఇథనాల్ ఆధారిత ప్రయాణ ప్రభావం గణనీయంగా పెరుగుతుం దన్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 28న సైనిక ఘర్షణ ప్రారంభానికి ముందు భారత ఎల్పీజీ దిగుమతులలో దాదాపు 60 శాతం హోర్ముజ్ జలసంధి గుండానే సాగేవని మంత్రి చెప్పారు. మొత్తం 140 కోట్ల జనాభా, ప్రపంచ సగటుతో పోలిస్తే 3 రెట్లు అధిక ఇంధన డిమాండ్ వృద్ధిగల దేశంగా భారత్ దేశవ్యాప్త పెట్రోలియం ఉత్పత్తుల నిరంతర లభ్యతకు భరోసా ఇచ్చిందన్నారు. "దేశంలో ఎక్కడా సరఫరాకు కొరతన్నది లేనేలేదు. ప్రజలు రహదారులు, గగన మార్గాల్లో యథావిధిగా ప్రయాణిస్తున్నారు. ప్రపంచమంతటా అంతరాయాలు తప్పకపోయినా, భారత్ మాత్రం దాదాపు సాధారణ స్థితిని కొనసాగిస్తోంది" అని మంత్రి పేర్కొన్నారు. తప్పుదోవ పట్టించే సమాచార వ్యాప్తితోపాటు కృత్రిమ కొరత సృష్టికి ప్రయత్నాలు చోటుచేసుకున్నా సకాలంలో విధానపరమైన చర్యలు సహా సమర్థ నిర్వహణ వల్ల పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉన్నదని ఆయన తెలిపారు.

భారత ఇంధన వ్యూహంలో మూడు కీలక స్తంభాలు- లభ్యత, అందుబాటు ధర, సుస్థిరతల మధ్య సమతూకం సాధనలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వ పటిమను అద్వితీయ మని శ్రీ పూరి ప్రశంసించారు. ఇంధన లభ్యత పరంగా ప్రపంచమంతటా అస్థిరత నెలకొన్నప్పటికీ, భారత్ మాత్రం ముడి చమురు, ఎల్పీజీ, సహజ వాయువు నిరంతర సరఫరాను కొనసాగించిందని ఆయన గుర్తుచేశారు. సంక్షోభానికి ముందు దేశీయ ఎల్పీజీ ఉత్పాదన రోజుకు 32 ట్రిలియన్ టన్నులు కాగా, ఆ తర్వాత దాదాపు 52 ట్రిలియన్ టన్నులకు పెంచినట్లు తెలిపారు. మరోవైపు పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువు సహా సీఎన్జీ వైపు మళ్లడాన్ని కూడా విస్తృతం చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజల కొనుగోలు శక్తి కొనసాగింపును ప్రస్తావిస్తూ- ప్రపంచంలో ఇంధన ధరల అత్యల్ప పెరుగుదల గల దేశాల జాబితా లో భారత్ ఒకటని మంత్రి అన్నా రు. ఈ మేరకు వినియోగ దారులకు ఉపశమనం కలిగిస్తూ పెట్రోల్, డీజిల్పై లీటరుకు రూ.10 వంతున కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ ప్రధానమంత్రి నిర్ణయించడాన్ని ఆయన గుర్తుచే శారు.

ఇంధన సుస్థిరత అంశాన్ని ప్రస్తావిస్తూ- బ్రెజిల్, అమెరికా దేశాల్లో చెరకు, మొక్కజొన్న ఆధారిత ఇథనాల్ మిశ్రణం విజయవంతమైందని, ఇది తన పూర్వానుభవమని పూరి గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు భారత ఇథనాల్ మిశ్రణం కూడా అత్యంత విజయవంతమైన ఇంధన మార్పిడి కార్యక్రమాలలో ఒకటిగా నిలిచిందన్నారు. రైతులు, ఉత్పత్తిదారులు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, వాహన తయారీదారులు, శాస్త్రవేత్తలు, ఆర్థిక సంస్థలన్నిటి సమ్మేళనంతో బలమైన వ్యవస్థ సృష్టి ద్వారానే ఇది సాధ్యమైందని చెప్పారు.

దీనికి అన్ని విభాగాల భాగస్వామ్యంగల ప్రభుత్వ విధానం దన్నుగా నిలిచిందని తెలిపారు. ధాన్యపు నూకలు, వ్యవసాయ వ్యర్థాలు, వెదురు, సముద్ర నాచు వంటి బహుళ ముడి పదార్థాలతో ఇథనాల్ను ఉత్పత్తి చేయగల సామర్థ్యం నేడు మన దేశానికి ఉందని పేర్కొన్నారు.

దేశంలో ఇంధన మిశ్రణం 2013-14 నాటికి కేవలం 1.5 శాతం కాగా, 2025-26కల్లా 20 శాతానికి చేరుకోవడం ద్వారా నిర్దేశిత గడువుకు ఐదేళ్లు ముందుగానే లక్ష్యం సాధించామని మంత్రి పేర్కొన్నారు. ఇథనాల్ కొనుగోళ్లు 'ఈఎస్వై' 2013-14లో 38 కోట్ల లీటర్లు కాగా, నేడు 1,040 కోట్ల లీటర్లకు పైగా పెరిగిందన్నారు. అలాగే, ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం 2014 నాటి 421 కోట్ల లీటర్ల స్థాయి నుంచి 2026కల్లా 2000 కోట్ల లీటర్లకు - దాదాపు 5 రెట్లు పెరిగిందని వెల్లడించారు. ఈ మార్పుతో ముడిచమురు దిగుమతుల తగ్గుదల, విదేశీ మారకం ఆదా, ఉద్గారాల తగ్గింపు రైతుల ఆదాయం పెరుగుదల వంటి ప్రయోజనాలు సమకూరాయని తెలిపారు.

దేశంలో ఇకపై అమ్ముడయ్యే కొత్త ద్విచక్ర, చతుశ్చక్ర వాహనాల్లో 50 శాతం మేర మిశ్రమ ఇంధన ప్రమాణాలకు అనుగుణంగా మార్చగలిగితే 311.8 కోట్ల లీటర్ల ఇథనాల్కు అదనపు డిమాండ్ ఏర్పడుతుందని మంత్రి చెప్పారు. తద్వారా రైతులకు ?12,403 కోట్ల అదనపు ఆదాయం లభించడమే కాకుండా 66.4 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతాయన్నారు.

నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన అధికారిక ప్రకటనలో- 'ఇ85' వంటి అధిక ఇథనాల్ మిశ్రమంతో నడిచే వాహనాలు సహా ఇథనాల్ ఆధారిత మిశ్రమ ఇంధన వాహనాలను (ఎఫ్ఎఫ్వి) శూన్య ఉద్గార వాహనాలుగా వర్గీకరించింది. 'ఇ85' ఇంధనంతో ఉద్గారాలు దాదాపు శూన్య పరమాణు పదార్థ స్థాయిలో ఉంటాయి. దేశంలో పెరుగుతున్న వాయు కాలుష్య నివారణలో మిశ్రమ వాహనాలు ఒక ఆశాజనక పరిష్కారం చూపుతాయి.

దేశవ్యాప్తంగా మిశ్రమ ఇంధనావరణ వ్యవస్థ విస్తరణ దిశగా ప్రభుత్వం రూపొందించిన భవిష్యత్ ప్రణాళిక గురించి మంత్రి వివరించారు. దీని ప్రకారం- 'బీఐఎస్' నిబంధనల కింద 'ఎఫ్ఎఫ్వీ'లలో 'ఇ85' వినియోగాన్ని 'మోనో-ఫ్యూయల్' ప్రమాణంగా ప్రకటించారు. అలాగే, తొలుత ఢిల్లీ రాజధాని ప్రాంతం, ముంబై-పుణె-నాగ్పూర్ కారిడార్లలో 50-100 'ఎఫ్ఎఫ్వి' సంసిద్ధ చిల్లర ఇంధన విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తారు. అటుపైన ఈ ఏడాది డిసెంబరు నాటికి 500 కేంద్రాల స్థాయికి పెంచాలని, 2027 ఆఖరుకల్లా ప్రధాన నగరాల్లో సుమారు 5,000 కేంద్రాల స్థాయికి విస్తరించాలని లక్ష్యనిర్దేశం చేసుకున్నారు.

దీంతోపాటు వినియోగం పెంపు దిశగా ప్రభుత్వ పరంగా ధరల మద్దతు, రహదారి పన్ను రాయితీ, 'ఇ85' టెస్టింగ్ ఇంధన లభ్యత, 'ఎఫ్ఎఫ్వీ'లు, చిల్లర విక్రయ కేంద్రాలకు ప్రత్యేక గుర్తింపు చిహ్నాలు, వినియోగదారు అవగాహన కార్యక్రమాలు, నిల్వ-పంపిణీ మౌలిక సదుపాయాల కల్పన వంటి చర్యలు విస్తృతంగా చేపడతారు. ఇదంతా కేవలం ఇంధన మార్పిడికి పరిమితం కాదని, కాలుష్య రహిత రవాణా, ఇంధన భద్రత బలోపేతం, మరింత స్వావలంబన దిశగా సంపూర్ణ వ్యవస్థను సృష్టించడంలో అంతర్భాగమని శ్రీ పూరి విశదీకరించారు.

'హీరో మోటోకార్ప్' సంస్థ నిన్న ఫ్లెక్స్-ఫ్యూయల్ మోటార్సైకిళ్లను ఆవిష్కరించగా, నేడు మారుతి సుజుకి ప్రయాణిక వాహనాన్ని ప్రవేశపెట్టిందని మంత్రి గుర్తుచేస్తూ- కాలుష్య రహిత రవాణా రంగం దిశగా నవ శకంవైపు భారత్ ప్రస్థానానికి నాందిగా ఈ పరిణామాన్ని ఆయన అభివర్ణించారు.

భారత రవాణా రంగ కాలుష్య రహిత రూపాంతరీకరణ దిశగా మారుతి సుజుకి కృషిని ఈ సందర్భంగా శ్రీ హర్దీప్ సింగ్ పూరి అభినందించారు. భారత ఇంధన రూపాంతరీకరణ దేశీయంగానే సాకారం కాగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశీయ ఆవిష్కరణలు, రైతుల తోడ్పాటు, వినియోగదారుల ఆదరణ ఇందుకు నవ్యోత్తేజం ఇస్తాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని విభాగాల్లోనూ ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహన మోడళ్ల మార్కెట్ ప్రవేశాన్ని వేగిరపరచాలని ఆటోమొబైల్ తయారీదారులకు సూచించారు. అలాగే దేశవ్యాప్తంగ 'ఇ85' ఇంధన లభ్యతను వేగంగా విస్తరించాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను కోరారు.

# గిన్నిస్ ప్రపంచ రికార్డుల్లో చోటు దక్కించుకున్న మై భారత్



న్యూఢిల్లీ, జూన్ 5:భారతీయ యువత కోసం ఉద్దేశించిన ప్రతిష్ఠాత్మక వేదిక 'మేరా యువభారత్ (మై భారత్) గిన్నిస్ ప్రపంచ రికార్డుల్లో స్థానం సంపాదించింది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని యువజన వ్యవహారాల విభాగం దీనిని నిర్వహిస్తోంది. ఒకే వారంలో అత్యధిక సంఖ్యలో ఆన్లైన్ క్విజ్లో పాల్గొన్న విభాగంలో మై భారత్ ఈ ఘనతను సాధించింది. అధికారికంగా ధ్రువీకరించిన సమయానికి 3,90,812 మంది ఇందులో పాల్గొన్నారు.

కేంద్ర యువజన వ్యవహారాలు - క్రీడలు, కార్మిక - ఉపాధి శాఖల మంత్రి డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ, యువజన వ్యవహారాలు - క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రక్షా నిఖిల్ ఖడ్సే, యువజన వ్యవహారాల శాఖ కార్యదర్శి డాక్టర్ పల్లవీ జైన్ గోవిల్, సంబంధిత సీనియర్ అధికారులు, గిన్నిస్ ప్రపంచ రికార్డుల ప్రతినిధులు, యువజన ప్రతినిధుల సమక్షంలో... న్యూఢిల్లీలోని శ్రమశక్తి భవన్లో ఈ రోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో గిన్నిస్ ప్రపంచ రికార్డుల న్యాయనిర్ణేత శ్రీ రిషినాథ్ మై భారత్కు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

వికసిత భారత్ఏ2047 దార్శనికతలో యువత అవగాహనను, వారి భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా చేపట్టిన దేశవ్యాప్తం యువ సమ్మిళిత కార్యక్రమం 'వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీడీవైఎల్డీ) క్విజ్'కు ఈ అరుదైన గుర్తింపు దక్కింది. మై భారత్ పోర్టల్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 50.42 లక్షల యువత పాల్గొన్నారు. దీంతో ఇది దేశంలో చేపట్టిన అతిపెద్ద డిజిటల్ యువ సమ్మిళిత కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచింది.

ఈ అద్భుత విజయాన్ని సాధించిన మై భారత్ను, బృందాన్ని మంత్రి అభినందించారు. దేశ జనాభాలో దాదాపు 65 శాతంగా ఉన్న 35 ఏళ్ల లోపు యువత ఆకాంక్షలకు ఈ పోర్టల్ బలాన్నిస్తోందన్నారు.

కేవలం మూడేళ్లలోనే మై భారత్లో 2.19 కోట్ల మంది యువత నమోదు కావడం, రోజూ కొత్తగా వేలాదిగా యువత ఇందులో చేరుతుండడాన్ని బట్టి.. ఈ పోర్టల్పై దేశ యువత నమ్మకం, విశ్వాసం స్పష్టమవుతోందని మంత్రి అన్నారు.

గిన్నిస్ ప్రపంచ రికార్డును సొంతం చేసుకోవడంపై దేశ యువతను మంత్రి అభినందించారు. ఈ ఘనత నిజంగా యువతదేననీ, వికసిత భారత్ ప్రస్థానంపై వారి విశ్వాసానికి ఇది నిదర్శనమనీ వ్యాఖ్యానించారు.

మై భారత్ పోర్టల్ కేవలం ఒక డిజిటల్ వేదిక మాత్రమే కాదని మంత్రి అన్నారు. యువత అర్థవంతమైన భాగస్వామ్యానికీ, తమ ఆలోచనలను పంచుకోవడానికీ వేదికగా దీనిని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత భారత్ను సాకారం చేసుకోవాలన్న ప్రధానమంత్రి లక్ష్యానికి దోహదపడే అవకాశా న్నిచ్చే విశ్వసనీయ, యువ సాధికారతా వేదికగా ఈ పోర్టల్ను అభివర్ణించారు. వీడీవైఎల్డీ ద్వారా యువత పంచుకున్న ఆలోచనలు.. 2026 కేంద్ర బడ్జెటులో ప్రతిబింబించడమే ఇందుకు నిదర్శనమన్నారు.

దేశవ్యాప్తంగా యువత అర్థవంతమైన భాగస్వామ్యానికి మై భారత్ పోర్టల్ ఒక విశ్వసనీయ వేదికగా నిలిచిందని యువజన వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీమతి పల్లవీ జైన్ గోవిల్ అన్నారు. యువత స్వచ్ఛందంగా, తమంతట తాముగా వివిధ రూపాల్లో భాగస్వాములవడానికి ఈ పోర్టల్ అవకాశాన్నిస్తుందన్నారు.

2025 అక్టోబర్ 25 నుంచి 31 అక్టోబర్ వరకు జరిగిన అధికారిక గిన్నిస్ ప్రపంచ రికార్డుల మదింపు సమయంలో ఈ పోర్టల్ వేదికగా 8.39 లక్షలకు పైగా యువత క్విజ్లో పాల్గొన్నారు. స్వతంత్ర డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్లు, ఆధారాల ధ్రువీకరణ, భాగస్వామ్య రికార్డుల సమగ్ర పరిశీలనతో కూడిన సమగ్ర ధ్రువీకరణ ప్రక్రియ అనంతరం.. ఈ క్విజ్లో 3,90, 812 మంది అర్హులు పాల్గొన్నారని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువీకరించింది. దాంతో మై భారత్ పోర్టల్ సరికొత్త రికార్డును నెలకొల్పింది.

డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించి యువత భాగస్వామ్యం కోసం అవకాశాలను విస్తరించడంలో భారత ప్రభుత్వ నిబద్ధతకు ఈ విజయం నిదర్శనం. స్వచ్ఛంద సేవ, అనుభవపూర్వక అభ్యాసం, నాయకత్వ అభివృద్ధి, సామాజిక కార్యాచరణ దిశగా జాతీయ వేదికగా మై భారత్ పాత్ర విస్తరిస్తోందనీ దీయువత సాధికారత, ప్రజల భాగస్వామ్యం కోసం డిజిటల్ ఆవిష్కరణలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు.. ఉమ్మడి సంకల్పమైన వికసిత భారత్ఏ 2047ను ముందుకు తీసుకెళ్లేలా భారత్ తీసుకుంటున్న చర్యల్లో గిన్నిస్ ప్రపంచ రికార్డు ఒక విశేష విజయంగా నిలుస్తుంది.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**-ఎమ్మెల్యే బొజ్జు పటేల్**

ఆదిలాబాద్, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవరణలో నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక్కో మొక్క నాటాలని,పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,కలు షితం అవుతున్న ప్రకృతిని మొక్కలు నాటి కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిది అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ అర్శద్ బేగం అన్సారి అల్లి, జై నూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోడసం రాధ బాయి,కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# రెవెన్యూ, రీ-సర్వే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

**-ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్ సుమిత్ కుమార్**

ఖమ్మం, జూన్ 5: ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడం, రెవెన్యూ శాఖలో పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన "ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు పర్యటనలు" కార్యక్రమానికి చిత్తూరు జిల్లాలో శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా తొలి సమావేశం శుక్రవారం గుడిపాల మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎఫ్వో సుబ్బరాజు, ఆర్డీవో శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. మ్యుటేషన్లు, జాయింట్ ఎల్పీఎం, సర్వే దిద్దుబాట్లు, మ్యాప్ లైన్ సవరణలు, దారి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు.

గ్రామాల్లో పెండింగ్లో ఉన్న సమస్యలను గుర్తించి అవసరమైతే ప్రత్యక్షంగా గ్రామాలను సందర్శించి ప్రజలకు సరైన మార్గదర్శకత్వం అందించాలని చెప్పారు. రీ-సర్వే ప్రక్రియకు సంబంధించిన ఫిర్యాదులు ఇంకా కొన్ని గ్రామాల్లో కొనసాగుతున్నాయని, వాటి పరిష్కారానికి అధికారులు వ్యవస్థబద్ధంగా పనిచేసి ఒకటి నుంచి రెండు నెలల్లో గణనీయమైన పురోగతి సాధించాలని సూచించారు.

రీ-సర్వే జరగనున్న గ్రామాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, చిన్న పొరపాట్లు కూడా భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తమ లాగిన్లలో ఉన్న అధికారాలను సమర్థవంతంగా వినియోగించి మ్యుటేషన్లు, రికార్డుల నవీకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలని తెలిపారు.

రీ-సర్వే కార్యక్రమం ప్రజల ఆస్తి హక్కులతో ముడిపడి ఉన్న అత్యంత కీలక ప్రక్రియ అని, ఇందులో జరిగే తప్పిదాలు సంవత్సరాల తరబడి వివాదాలకు కారణమవుతాయని పేర్కొన్నారు. తహసీల్దార్లు తమ పరిధిలోని రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోల వద్దకు వచ్చిన ఫిర్యాదులను క్రమం తప్పకుండా సమీక్షించి, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యల నివేదికను వారంలోపు నమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కుటుంబ విభజనలు, భూసరిహద్దు వివాదాలు వంటి సంక్లిష్ట అంశాల్లో సంబంధిత పక్షాలకు తగిన సూచనలు అందించి నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రీ-సర్వే ప్రక్రియను నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయడానికి ప్రతి అధికారి ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మరో 15 రోజుల తర్వాత మండల స్థాయిలో మళ్లీ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల సంఖ్యను గణనీయంగా తగ్గించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆకాంక్షించారు.

అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి అర్జీలు పెండింగ్లో లేకుండా చూడడం, సమస్యలేని గ్రామాలుగా తీర్చిదిద్దడం, ప్రజా సేవలను ఇంటి వద్దకే చేర్చడం, పీజీఆర్ఎస్లో అందిన వినతులు, ఫిర్యాదులను నెల రోజుల్లో పరిష్కరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా శాశ్వత పరిష్కారాలు చూపించడం, కోర్టు వివాదాలను తగ్గించడం, ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు.

# మత్రియా తండాలో అనుమానాస్పద హత్య

**-పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు**

నల్గొండ, జూన్ 5:ఎ. కొండూరు మండలం మత్రియా తండా గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన ఓ వ్యక్తి హత్య స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన ధారావతు శ్రీరాములు (38) మృతి చెందిన ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య నాగమణి,ఆమె బావమరిది కొర్ర మనోహర్బాబు కలిసి శ్రీరాములను హత్య చేశారని బంధువులు ఆరోపిస్తున్నారు.

అయితే ఈ ఘటనలో మరొక వ్యక్తి ప్రమేయం కూడా ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేస్తూ,పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణానికి గల ఖచ్చితమైన కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ హత్య కేసును పోలీసులు అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన అనుమానితులను గోప్యంగా తిరువూరు సీఐ కార్యాలయంలో విచారిస్తున్నట్లు తెలిసింది.

ఘటన వెనుక ఉన్న అసలు కారణాలు, ఇతరుల ప్రమేయం వంటి అంశాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు.మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం .కాగా పూర్తి వివరాలు పోలీసుల అధికారిక ప్రకటన అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కార్యాచరణకు పిలుపునిచ్చిన వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 5:పర్యావరణ సవాళ్లను పరిష్కరించడానికి ఉమ్మడి కార్యాచరణనీ, ప్రజల భాగస్వామ్యాన్నీ కోరుతూ కేంద్ర మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజలతో పంచుకున్నారు.

ఈ సవాళ్లను ప్రకృతి ఆధారిత పద్ధతులను అనుసరించి పరిష్కరించుకొందామని మంత్రి పిలుపునిచ్చారని ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఆయా పద్ధతులు దీర్ఘకాలంపాటు ప్రభావాన్ని చూపేవీ, తక్కువ ఖర్చుతో కూడినవీ, పర్యావరణ ప్రయోజనాలను అందించగలవీ అయి ఉండాలని మంత్రి పేర్కొన్నారు.

పచ్చదనంతో కళకళలాడే ఢిల్లీ.. అభివృద్ధి, పర్యావరణ సంరక్షణ బాధ్యతల మధ్య సమతౌల్యాన్ని కాపాడడానికి భారత్ కనబరుస్తున్న నిబద్ధతకు ఒక ప్రతీక కాగలదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారని శ్రీ మోదీ అన్నారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి పొందుపరుస్తూ:

"ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, కేంద్ర మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ పర్యావరణ సంబంధిత సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రకృతి ఆధారిత పరిష్కారాల ద్వారా ఉమ్మడి కార్యాచరణ, ప్రజాభాగస్వామ్యం అవసరమంటూ పిలుపునిచ్చారు. ఆ పరిష్కారాలు దీర్ఘకాలం పాటు ప్రభావాన్ని చూపేవీ, తక్కువ ఖర్చుతో కూడినవీ, పర్యావరణానికి మేలు చేసేవీ అయి ఉండాలని ఆయన అన్నారు.

పచ్చదనంతో కళకళలాడే ఢిల్లీ.. అభివృద్ధితో పాటే పర్యావరణ సంరక్షణ బాధ్యతను కూడా సమతౌల్యం చేసుకోవాలన్న భారత్ నిబద్ధతకు ఒక ప్రతీక కాగలదని ఆయన స్పష్టం చేశారు" అని పేర్కొన్నారు.

# భారత్‌లో 100వ రామ్‌సర్ స్థలంగా జై ప్రకాశ్ నారాయణ్ పక్షుల అభయారణ్యం.. ప్రధానమంత్రి హర్షం

న్యూ ఢిల్లీ, జూన్ 5:భారత్.. రామ్సర్ స్థలాల్లో 'సెంచరీ'ని సాధించినందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తర్ప్రదేశ్.. బలియాలో గల జై ప్రకాశ్ నారాయణ్ పక్షుల అభయారణ్యాన్ని (సురహా తాల్) దేశంలో 100వ రామ్సర్ స్థలంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రధాని స్పందించారు.ఆ బురద నేల వివిధ రకాలైన పక్షులకు నిలయంగా ఉందనీ, స్థానిక పక్షులతో పాటు అనేక వలస పక్షులను కూడా ఈ ప్రాంతం ఆకర్షిస్తోందనీ ప్రధాన మంత్రి అన్నారు. ఈ ప్రశంసనీయ ప్రగతి ప్రస్థానం.. ప్రాకృతిక పర్యావర ణాన్ని, మరీ ముఖ్యంగా కీలక బురద నేలల్ని సంరక్షించుకోవ డంలో భారత్ కనబరుస్తున్న తిరు గులేని నిబద్ధతను కళ్లకు కడుతోందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. బురద నేలల సంరక్షణ, పునరుద్ధరణ దిశగా సాగుతున్న ప్రయత్నాలను గత కొన్ని సంవత్స రాల్లో, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు విజ్ఞానశాస్త్రం, నూతన ఆవిష్కరణలు, క్రియాశీల జాగరూకత కార్యక్రమాలను కూడా నిర్వహించి చెప్పుకోదగిన రీతిలో బలోపేతం చేశారని ప్రధానమంత్రి వివరించారు. ఈ ఉమ్మడి కృషితో జీవవైవిధ్యాన్ని సంరక్షించడంలో, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడడంలో, రాబోయే తరాలను దృష్టిలో పెట్టుకొని పచ్చదనంతో అలరారే భవిష్యత్తును నిర్మించడంలో ఊతం లభించిందని ఆయన స్పష్టం చేశారు.

# న్యూఢిల్లీలో 18 నమో ఆక్సిజన్ పార్కులను ప్రారంభించిన కేంద్ర పర్యావరణ మంత్రి



న్యూఢిల్లీ, జూన్ 5:ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా ఢిల్లీ వ్యాప్తంగా 18 నమో ఆక్సిజన్ పార్కులను ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తాతో కలిసి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ప్రారంభించారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా మైదాన్‌గఢిలోని నమో ఆక్సిజన్ పార్కులో నిర్వహించిన ఈ వేడుకలో పలు పర్యావరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జాతీయ రాజధాని ప్రాంతంలో పచ్చదనాన్ని బలోపేతం చేయడం, గాలి నాణ్యతను మెరుగుపరచడం, ప్రజా భాగస్వామ్యంతో కూడిన పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే దిశగా ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్, ఢిల్లీ పర్యావరణ, అటవీ, వన్యప్రాణుల శాఖ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ సిర్సా, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

సమావేశాన్ని ఉద్దేశించి శ్రీ భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మానవాళి వాతావరణ మార్పులు, జీవవైవిధ్య క్షీణత, ఎడారీకరణకు దారితీసే భూసార క్షీణత వంటి మూడు ప్రధాన పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో పర్యావరణ పరిరక్షణ చర్యల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్ అవతరించిందని ఆయన పేర్కొన్నారు. సౌరశక్తి సామర్థ్యాన్ని పెంపొందించడంలో ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలవడం, పీఎం సూర్య ఘర్ యోజన అమలు, అంతర్జాతీయ సౌర కూటమి స్థాపన, అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబీసీఏ) ఏర్పాటు, రామ్‌సర్ చిత్తడి నేలల విస్తరణ, ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పుల సదస్సు పరిధిలో నిర్దేశించుకున్న పలు జాతీయ నిర్ధారిత సహకార (ఎన్‌డీసీ) లక్ష్యాలను గడువుకంటే ముందే సాధించడం వంటి కీలక విజయాలను భారత్ అధిగమించిందని ఆయన పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి, క్రియాశీల ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారాన్ని ప్రస్తావిస్తూ.. ఈ కార్యక్రమం మొక్కలు నాటడాన్ని కేవలం ఒక విధిగా కాకుండా కృతజ్ఞత, బాధ్యత, పర్యావరణ స్పృహతో కూడిన ప్రజా ఉద్యమంగా మార్చిందని ఆయన కొనియాడారు. పౌరులు కేవలం మొక్కలు నాటడమే కాకుండా, రాబోయే తరాల కోసం వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ఢిల్లీ పర్యావరణాన్ని మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలను శ్రీ భూపేందర్ యాదవ్ వివరించారు. గాలి నాణ్యత నిర్వహణ కమిషన్ సమన్వయంతో ఢిల్లీ ప్రభుత్వం రోడ్లపై దుమ్ము, వాహనాల ఉద్గారాలు, పారిశ్రామిక కాలుష్యంతో కూడిన వాయు కాలుష్య కారకాలను నియంత్రించడానికి కీలక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా నిరంతర ఉద్గార పర్యవేక్షణ వ్యవస్థల ఏర్పాటు, వాయు కాలుష్య నియంత్రణ పరికరాల వినియోగం, రోడ్లను యంత్రాల ద్వారా శుభ్రం చేయడం, ఎలక్ట్రిక్ వాహనాల వైపు వేగంగా మారడం వంటి చర్యలను చేపట్టినట్లు వివరించారు.

నమో వ్యాన్లు, ఇతర పర్యావరణ వనరుల అభివృద్ధి ద్వారా దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించే హరిత కార్యక్రమాలను చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ దిశగా ఢిల్లీలో వాయు నాణ్యతను మెరుగుపరచడానికి, జీవవైవిధ్యాన్ని పెంపొందించడానికి, పౌరులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు 18 నమో ఆక్సిజన్ పార్కులను అభివృద్ధి చేసి ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల దీర్ఘకాలిక విజయానికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకమని చెప్పారు. సంపూర్ణ పర్యావరణ వ్యవస్థ రక్షణ, పర్యావరణ స్థితిస్థాపకతను నిర్ధారించడానికి అడవులు, చిత్తడి నేలలు, గడ్డి భూములను సమగ్రంగా పరిరక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

వేగంగా విస్తరిస్తున్న పట్టణ జనాభా మధ్య.. పట్టణ పర్యావరణ వ్యవస్థల సమర్థవంతమైన నిర్వహణ, జీవవైవిధ్య పరిరక్షణ, చిత్తడి నేలల రక్షణ, సుస్థిర అభివృద్ధికి ఈ శాస్త్రీయ ప్రణాళికా పత్రాలు ఎంతగానో దోహదపడతాయని శ్రీ భూపేందర్ యాదవ్ తెలిపారు. అలాగే రాజధానిలో పర్యావరణహిత పరిపాలనను బలోపేతం చేయడంలోనూ సహాయపడతాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా మాట్లాడుతూ.. ఢిల్లీలో గాలి నాణ్యతను మెరుగుపరచడానికి పచ్చదనాన్ని పెంపొందించడం అత్యంత కీలకమైన చర్యగా అభివర్ణించారు. ప్రస్తుత సంవత్సరంలో ఢిల్లీ వ్యాప్తంగా 15 లక్షల మొక్కలను నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆమె ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణలో పౌరుల పాత్రను ప్రస్తావిస్తూ.. కేవలం మొక్కలు నాటే కార్యక్రమాలకే కాకుండా, నాటిన తర్వాత ఆ మొక్కలను పోషించడానికి, సంరక్షించడానికి, సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరమని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ప్రముఖులందరూ 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా మొక్కలు నాటడంతోపాటు 'కాలుష్య రహిత ఢిల్లీ' ప్రచారంలో భాగంగా స్థానిక రకాల గడ్డి, పొదలకు సంబంధించిన ప్రదర్శనను తిలకించారు. తద్వారా పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి పట్ల తమకున్న నిబద్ధతను చాటుకున్నారు. 'ఢిల్లీ బర్డ్ అట్లాస్' రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన స్వచ్ఛంద సంస్థలను ఈ వేడుకలో ప్రశంసా పత్రాలతో సత్కరించారు. పర్యావరణానికి సంబంధించిన సమాచార సేకరణ, పర్యవేక్షణలో ప్రజల భాగస్వామ్యం అమూల్యమైనదని కొనియాడారు.

# 2026- 27 సంవత్సరానికి బీమా పరిధిలో ఉన్న వ్యక్తుల పిల్లల (వార్డ్ ఆఫ్ ఐపీ) కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ఈఎస్ఐసీ

న్యూ ఢిల్లీ, జూన్ 5:2026-27 విద్యా సంవత్సరానికిగాను బీమా పరిధిలో ఉన్న కార్మికుల పిల్లల (వార్డ్ ఆఫ్ ఐపీ) కోటా కింద అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్, నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం.. కేంద్ర కార్మిక - ఉపాధి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఉద్యోగుల రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) దరఖాస్తులను ఆహ్వానించింది. ఉద్యోగుల రాజ్య బీమా (ఈఎస్ఐ) పథకం పరిధిలోకి వచ్చే కార్మికుల పిల్లలకు మాత్రమే ఈ కోటాలో ప్రవేశానికి అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా బీమా పరిధిలోకి వచ్చే కార్మికుల కుటుంబాలకు అర్థవంతమైన సామాజిక భద్రతతోపాటు విద్యాపరమైన ప్రయోజనాలను అందించడంలో ఈఎస్ఐసీ నిబద్ధతకు ఇది నిదర్శనం.

2026-27 విద్యా సంవత్సరానికి గాను వార్డ్ ఆఫ్ ఐపీ కోటా కింద దేశవ్యాప్తంగా మొత్తం 783 సీట్లను తాత్కాలికంగా కేటాయించారు. 22 వైద్య, దంత, నర్సింగ్ కళాశాలల్లో మొత్తం 695 ఎంబీబీఎస్, 28 బీడీఎస్, 60 బీఎస్సీ నర్సింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలతోపాటు.. అర్హులైన కార్మికుల పిల్లల కోసం సీట్లను రిజర్వు చేసిన కొన్ని ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలు కూడా ఇందులో ఉన్నాయి. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ (డీజీహెచ్ఎస్) నిర్వహించే కేంద్రీకృత కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా ఈ ప్రవేశాలు జరుగుతాయి.

కార్మికుల కుటుంబాల విద్యాపరమైన ఆకాంక్షలకు దన్నుగా నిలిచేందుకు ఈఎస్ఐసీ చేపట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సంక్షేమ కార్యక్రమాల్లో వార్డ్ ఆఫ్ ఐపీ కోటా ఒకటి. అర్హులైన విద్యార్థులు అత్యంత తక్కువ ట్యూషన్ ఫీజులతోనే ప్రొఫెషనల్ కోర్సులైన వైద్య, నర్సింగ్ విద్యను అభ్యసించేందుకు ఈ పథకం దోహదపడుతుంది. ఈ కోటా కింద ప్రవేశం పొందే విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు ఏడాదికి కేవలం రూ. 24,000, అలాగే బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు ఏడాదికి రూ. 10,000 ట్యూషన్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. దీనివల్ల ఈఎస్ఐ పథకం లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య విద్య సులభంగా, తక్కువ ఖర్చుతోనే అందుబాటులోకి వస్తుంది. ఈ కోటాలో ప్రవేశాల కోసం ఎలాంటి క్యాపిటేషన్ ఫీజు లేదా డొనేషన్లు వసూలు చేయడానికి వీల్లేదు.

తల్లి లేదా తండ్రి ఈఎస్ఐ చట్టం కింద నమోదు చేసుకుని బీమా పొంది ఉండి, 2025 సెప్టెంబర్ 30 నాటికి ఈఎస్ఐ పథకానికి తమ వాటా చెల్లిస్తూ ఉంటే.. వారి పిల్లలు ఈ కోటాను పొందేందుకు అర్హులు. దరఖాస్తుదారు సదరు బీమా పొందిన కార్మికుడి సంతానమై ఉండాలి. అలాగే నీట్ (యూజీ)- 2026 పరీక్షకు తప్పక హాజరై ఉండాలి. అలాగే జాతీయ వైద్యవిద్యా కమిషన్, భారత దంతవైద్య విద్యా మండలి, భారత నర్సింగ్ కౌన్సిల్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను పూర్తిచేయాలి. వయోపరిమితి విషయానికొస్తే.. 2026 మార్చి 8 నాటికి పురుష అభ్యర్థుల వయస్సు 21 ఏళ్లు దాటకూడదు. అయితే ఈఎస్ఐ చట్టం-1948 నిబంధనల ప్రకారం, బీమా పరిధిలో ఉన్న కార్మికుడిపై ఆధారపడి ఉన్న అవివాహిత మహిళా (కుమార్తెలు) అభ్యర్థులకు వయో పరిమితి నిబంధన వర్తించదు.

ఈ ప్రవేశ ప్రక్రియలో పాల్గొనడానికి అర్హులైన అభ్యర్థులు తప్పనిసరిగా ఈఎస్ఐసీ జారీ చేసిన చెల్లుబాటు అయ్యే 'వార్డ్ ఆఫ్ ఐపీ' ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ధ్రువీకరణ పత్రాన్ని పొందే దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. దీనిని ఈఎస్ఐసీ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు నిర్దేశిత వివరాలను అందించడంతోపాటు.. ఫొటోలు, వయస్సు ధ్రువీకరణ పత్రం, నీట్(యూజీ)- 2026 అడ్మిట్ కార్డు, అవసరమైన చోట్ల సంబంధిత ఇతర సర్టిఫికేట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఈ ధ్రువీకరణ పత్రం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 2026 జూన్ 21. ఈ దరఖాస్తు ప్రక్రియ ఓటీపీతో ముడిపడి ఉన్నందున.. బీమా పరిధిలో ఉన్న కార్మికుడి మొబైల్ నంబరు ఈఎస్ఐసీ డేటాబేస్‌లో సరిగ్గా అప్‌డేట్ అయి ఉండేలా అభ్యర్థులు ముందుగానే సరిచూసుకోవాలి. వార్డ్ ఆఫ్ ఐపీ ధ్రువీకరణ పత్రాన్ని పొందిన తర్వాత, కేంద్రీకృత కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనడం కోసం.. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) పోర్టల్‌లో అభ్యర్థులు విడిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ ప్రవేశ ప్రక్రియ గురించిన సమాచారం అర్హులైన లబ్ధిదారులందరికీ చేరేలా విస్తృతంగా ప్రాచుర్యం కల్పించాల్సిందిగా.. యాజమాన్యాలు, కార్మికులు, ప్రాంతీయ కార్యాలయాలు, శాఖా కార్యాలయాలు, హాస్పిటళ్లు, రాష్ట్ర ఈఎస్ఐ అధికారులు సహా సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నింటికీ ఈఎస్ఐసీ విజ్ఞప్తి చేసింది. ఈఎస్ఐ పథకం పరిధిలోకి వచ్చే యాజమాన్యాలు తమ ఉద్యోగులకు ఈ అవకాశం గురించి తెలియజేయాలని, పని ప్రదేశాల్లో ఈ అడ్మిషన్ నోటీసును అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని కోరింది. అలాగే ఈఎస్ఐసీ రికార్డుల్లో కార్మికుల మొబైల్ నంబర్ల ధ్రువీకరణ, అప్‌డేషన్ ప్రక్రియలో సహకరించాలని సూచించింది. దరఖాస్తులను సకాలంలో సమర్పించి, ప్రాసెస్ చేయడానికి వీలుగా అభ్యర్థులకు అవసరమైన సహాయాన్ని అందించేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని క్షేత్రస్థాయి కార్యాలయాలకు సూచించింది.

ఉద్యోగుల రాజ్య బీమా సంస్థ ప్రపంచంలోని అతిపెద్ద సామాజిక భద్రతా సంస్థలలో ఒకటి. కార్మికులకు, వారి కుటుంబాలకు వైద్య, ఆరోగ్య సేవలను అందిస్తుంది. ప్రసూతి ప్రయోజనం, దివ్యాంగజనులూ, కార్మికులపై ఆధారపడిన వారికీ వివిధ సేవలతోపాటు సమగ్ర సామాజిక భద్రతా ప్రయోజనాలను అందిస్తుంది. వార్డ్ ఆఫ్ ఐపీ కోటా వంటి పథకాల ద్వారా.. భారతీయ కార్మికుల సంక్షేమం, సాధికారత, సామాజిక - ఆర్థిక పురోగతి పట్ల అంకిత భావాన్ని ఈఎస్ఐసీ ఎప్పటికప్పుడు బలంగా చాటుకుంటోంది.

# గోడలపై రంగులతో పర్యావరణ సందేశం..

## -స్క్రాప్ థీమ్ పార్కులో వినూత్న వాల్ ఆర్ట్



అమరావతి, జూన్ 5:ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని చౌడేశ్వరి కాలనీలో అభివృద్ధి చేస్తున్న వినూత్న 'స్క్రాప్ థీమ్' పార్కులో గురువారం సామూహిక వాల్ ఆర్ట్ పెయింటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పాల్గొని చిన్నారులు, మహిళలను ప్రోత్సహించారు.

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దాదాపు 400 మందికి పైగా మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, స్వచ్ఛత వంటి అంశాలను ప్రతిబింబించే చిత్రాలను పార్కు గోడలపై రంగురంగులుగా చిత్రించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ చిన్నారులతో ముచ్చటించి వారు గీసిన చిత్రాల వెనుక ఉన్న భావాలను తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన తమ ఆలోచనలను కళారూపంలో వ్యక్తపరుస్తున్న చిన్నారులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పర్యావరణంపై బాధ్యతాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

స్క్రాప్ పదార్థాలతో అభివృద్ధి చేస్తున్న ఈ పార్కు పర్యావరణహిత సందేశాన్ని ప్రజలకు చేరవేయడంలో ఆదర్శంగా నిలుస్తోందని అధికారులు తెలిపారు. వాల్ ఆర్ట్ కార్యక్రమం ద్వారా పార్కు మరింత ఆకర్షణీయంగా మారడంతో పాటు పర్యావరణ చైతన్యానికి వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మెప్మా పీడీ నాగరాజు, స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారత జీడీపీ వృద్ధి రేటు 7.7 శాతం.. 2025-26 ఆర్థిక సంవత్సర డాటా వెల్లడించిన కేంద్రం

ఎనిటతిజీ : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత దేశం 7.7 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. గత ఏడాది వృద్ధి రేటు 7.1 శాతంకాగా, ఈ ఏడాది అంతకుమించి వృద్ధి రేటు సాధించింది.

ఒకవక్క అంతర్జాతీయ సంక్షోభం, యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ దేశం భారీగా జీడీపీ వృద్ధిరేటు సాధించిందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అందులోనూ గత జనవరి నుంచి మార్చి వరకు త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చేదే. ఈ ఏడాది అరుదైన ఫలితాలు సాధించడంలో తయారీ, సేవలు, వాణిజ్య రంగాలతోపాటు, వ్యవసాయం, మత్స్య రంగాలు కూడా కీలకంగా మారాయి. 2022-23 నాటి స్థిర ధరల అంచనా ప్రకారం ఈ ఏడాది జీడీపీ 323.12 లక్షల కోట్లకు చేరుకుంది.

అంతకుముందు సంవత్సరం.. అంటే 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 299.89 లక్షల కోట్లుగా ఉంది. ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే సాధారణ జీడీపీ రేటు 8.9 శాతానికి పెరిగింది. అంటే దీని విలువ గత ఏడాది 318.07 లక్షల కోట్ల నుంచి ఈ ఏడాది 346.36 లక్షల కోట్లకు చేరింది. జీడీపీ అంటే దేశంలో ఒక ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి అయిన అన్ని వస్తువులు, సేవల మొత్తం విలువ.

# లేపాక్షిలో యోగాంధ్రకు ముస్తాబు..

## -ప్రారంభోత్సవానికి భారీ ఏర్పాట్లు

అమరావతి, జూన్ 5:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ''యోగాంధ్ర'' కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని జూన్ 7న లేపాక్షిలో ఘనంగా



నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు.

లేపాక్షిలోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయం ముందు ప్రాంగణంలో జరగనున్న కార్యక్రమం కోసం చేపట్టిన ఏర్పాట్లను ఆయన స్వయంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళా సంఘాల సభ్యులు, యోగా సాధకులు, శిక్షణ పొందిన యోగా మాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేదిక నిర్మాణం, కూర్చోవడానికి సౌకర్యాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య సేవలు, విద్యుత్ సౌకర్యాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించిన కలెక్టర్, యోగ ప్రాముఖ్యతను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

లేపాక్షి చారిత్రక, సాంస్కృతిక వైభవానికి తగిన రీతిలో కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యాచరణ ప్రణాళిక, శాఖల వారీ బాధ్యతలు, ప్రజల రాకపోకల నిర్వహణ, భద్రతా చర్యలు, యోగా ప్రదర్శనలు, యోగా మాస్టర్ల సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

జూన్ 7న జరగనున్న యోగాంధ్ర ప్రారంభోత్సవంలో ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, యోగా పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిపాలన విజ్ఞప్తి చేసింది.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, లేపాక్షి ఎంపీడీఓ, తహసీల్దార్, గ్రామ కార్యదర్శి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేస్తామని వారు కలెక్టర్‌కు వివరించారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్గొండ, జూన్ 5:: పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం భువనగిరి పార్టీ ఆఫీసులో ఏశాల అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచి సామాన్య, మధ్య తరగతి పేదలపై భారం మోపిందన్నారు. వివిధ రాష్ట్రాలలో ఉన్నటువంటి ప్రతిపక్ష పార్టీలను విడదీసి పాలన కొనసాగించే విధానాలు ప్రధాని మోదీ చేస్తున్నాడని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోవడం ద్వారా యువతలో అసంతృప్తి విపరీతంగా పెరిగిపోయి యువత ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకం గా కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తే కోట్లాది మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకోవడం కేంద్ర ప్రభుత్వ అసమర్థత వల్లే అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఈ నెల 10న నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోదా శ్రీరాములు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

## - ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్

ఖమ్మం, జూన్ 5: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ అన్నారు. శుక్రవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కర్మాగారం పరిసరాల్లో ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణ కోసం పాటించాల్సిన అంశాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్, మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ రాంబాబు, టెక్నికల్ హెడ్ జయంతుకుమార్దాస్, ఎన్విరాన్‌మెంట్ హెడ్ ప్రఫుల్లా కుమార్ సమంత సింగార్లతో కలిసి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం అలవాటు చేసుకోవాలన్నారు.

కాలుష్యాన్ని నివారించడం కోసం కర్మాగారంలో పచ్చదనానికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు.

అనంతరం కార్మిక కుటుంబాల పిల్లలు, మేనేజర్లు, కార్మికులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా కర్మాగారం పరిసరాల్లో, లారీ యార్డు ఆవరణలో మేనేజర్లు, ఐటీసీ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ అధికారులు చెంగల్‌రావు, టీఎస్ భాస్కర్, ఆర్పీ సింగ్, మనీష్ శర్మ, శివరామకృష్ణ, సౌరబ్ ముఖర్జీ పాల్గొన్నారు.

# పచ్చదనం పెంపే భావితరాలకు భద్రమైన భవిష్యత్ : నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య

నల్గొండ, జూన్ 5: పచ్చదనమే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అని నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నల్లగొండ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మన భవిష్యత్ కోసం వాతావరణం- ప్రకృతి ప్రేరణ అనే నినాదంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి పరిరక్షణ పర్యావరణ సమతుల్యకి, వాతావరణ మార్పుల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పండ్ల చెట్ల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన ఫలాలు అందడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహద పడుతుందన్నారు. నల్లగొండలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మలచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. నగరంలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# నీటి పారుదల రంగానికి కె.ఎల్.రావు ఎనలేని సేవలు

నీటిపారుదల రంగంలో అపర భగీరథుడిగా కీర్తించబడే తెలుగు ప్రజలు గర్వించ దగిన డా. కానూరి లక్ష్మణరావు (జూన్ 6, 1902 – మే 18, 1986) భారత దేశం లోనే గాక ప్రపంచ వ్యాప్తంగా నీటిపారుదల రంగంలో విప్లవాత్మకమైన పనులు చేసిన గొప్ప ఇంజనీరు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య తర్వాత గొప్ప వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. 1902 జూలై 14న కృష్ణా జిల్లా కంకిపాడు గ్రామంలో జన్మించిన కె.ఎల్.రావు మద్రాసు విశ్వ విద్యాలయములో ఇంజ నీరింగు (బీ.ఈ) డిగ్రీ పూర్తి చేసి, గిండీ ఇంజనీరింగు కళాశాల నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి, మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఇంజ నీరింగులో మాస్టరు డిగ్రీ (ఎం.ఎస్.సి ఇన్ ఇంజనీరింగ్) పొందిన తొలి వ్యక్తిగా నిలిచారు.

చదువు పూర్తయిన తర్వాత విశాఖ జిల్లా బోర్డు అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేశారు. తదనంతరం రంగూన్ కూడా ఉద్యోగం చేశారు. కొంత కాలం తర్వాత రావు గారు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశోధ కుడిగా చేరారు.

ఇంగ్లండ్ లోని బర్నింగ్ హోమ్ విశ్వ విద్యాలయం నుండి 1939 లో డాక్టరేట్ డిగ్రీ పొందారు. కొంత కాలం పాటు ఇంగ్లాండ్ లో ప్రొఫెసర్ గా పనిచేసిన ఆయన 1946లో భారత దేశం తిరిగి వచ్చి మద్రాసు ప్రభుత్వంలో డిజైన్ ఇంజనీర్ గా చేరారు. 1950 – 54 మధ్యకాలంలో భారత ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్ గా పని చేశారు.

ప్రభుత్వంలో ఇంజనీర్ గా పని చేస్తున్న సమయాన, దేశం లోని అనేక నీటిపారుదల ప్రాజెక్టు లకు నమూనాలు తయారు చేశారు.

నాగార్జునసాగర్, పులిచింతల, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి ఎన్నో సుప్రసిద్ధ నీటిపారుదల పథకాలకు రూపకల్పన చేశారు. గంగా, బ్రహ్మపుత్ర తదితర నదుల వరదల నివారణకై అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. అందులో భాగంగానే గాంధీ సాగర్ , జవహర్ సాగర్ రాణాప్రతాప్ సాగర్ వంటి నిర్మాణాలు సిద్ధం చేశారు.

నాటి ప్రభుత్వం నాగార్జున సాగర్, భాక్రానంగల్ ప్రాజెక్ట్, హిరాకుడ్ ప్రాజెక్ట్ విషయంలో పిలిపించిన విదేశీ ఇంజనీర్లు కూడా రావు ను సంప్రదించడం ఆయన ప్రతిభకు నిదర్శనం.



జూన్ 6...
డాక్టర్ కానూరి లక్ష్మణరావు జయంతి

ఇంజనీరింగ్ విషయాలకు సంబంధించి ఈయన రాసిన "ఇండియాస్ వాటర్ వెల్త్" అనే పుస్తకం నేటి తరాల శాస్త్రవేత్తలకు ప్రామాణిక గ్రంథంగా ఉంది.

ఉద్యోగ విరమణ అనంతరం నాటి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డి పిలుపు మేరకు 1962, 1967 ,1971 లో విజయవాడ నుంచి పార్లమెంటుకు పోటీ చేసి గెలిచారు. నెహ్రూ, శాస్త్రి, ఇందిరా గాంధీ, నేతృత్వంలోని ప్రభుత్వంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రిగా పని చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే గంగా బ్రహ్మపుత్ర నదిలో వర్షాకాలంలో చేరుతున్న నీటిని నిల్వ ఉంచి భారతదేశంలో క్షామ ప్రాంతాలైన మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు నీటి సౌకర్యం కల్పించే "నేషనల్ వాటర్ గ్రిడ్" పథకానికి రూపకల్పన చేశారు.

1963లో పద్మభూషణ్, రూర్కీ, ఆంధ్రా మరియు జే ఎన్ టీ విశ్వ విద్యాలయాల డాక్టరేట్లు పొందారు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్, అలాగే ఆల్ ఇండియా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సాయిల్ మెకానిక్స్ అండ్ జియోటెక్నికల్ ఇంజనీరింగ్ (ఆసియా) వైస్ ప్రెసిడెంట్ గా, రంగూన్ (బర్మా, ఇప్పుడు మయన్మార్)లో ప్రొఫెసర్‌గా, యునైటెడ్ కింగ్‌డమ్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఇంజనీరుగా చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మూడు పర్యాయాలు రాష్ట్రపతి పురస్కా రం లభించింది. ఆయన జ్ఞాపకార్థం పులిచింతల ప్రాజెక్టుకు కె.ఎల్.రావు ప్రాజెక్టు అని నామ కరణము చేయ బడింది. ఒక ఇంజనీరు పేరును ప్రాజెక్టుకు పెట్టడం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇదే ప్రథమం. 1986 మే 18 న 84 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు.



–రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# ప్రభుత్వం నుండి బిల్లులు రాక ఆగుతున్న గుత్తేదారుల గుండెలు

**– ఉపాధి లేక కార్మికుల కుటుంబాల అవస్థలు**
**–సమస్య తీవ్రత తెలిపేందుకే చలో హైదరాబాద్**
**–రాష్ట్ర వ్యాప్తంగా రూ.20 వేల కోట్ల పెండింగ్ బకాయిలు**
**–విలేకరుల సమావేశంలో బీఏఐ రాష్ట్ర నేతలు, కాంట్రాక్టర్లు వెల్లడిహైదరాబాద్ వార్తలు**



ఖమ్మం, జూన్ 5: రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది గుత్తేదారులకు వేలకోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడం ద్వారా ఇప్పటికే అనేకమంది కాంట్రాక్టర్లు, బిల్డర్స్ అసోసియేషన్ నాయకుల గుండెలు ఆగిపోయాయని సత్వర పరిష్కారం కోసమే చలో హైదరాబాద్‌కు పిలుపునివ్వడం జరిగిందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు, కాంట్రాక్టర్లు తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బి ఏ ఐ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డివిఎన్ రెడ్డి రాష్ట్ర చైర్మన్ శ్రీనివాసరావు, సెక్రెటరీ పవన్ కోశాధికారి సంతోష్ రెడ్డి, కిసాన్ శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా సెంటర్ చైర్మన్ కిశోర్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంట్రాక్టర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొద్ది సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కాంట్రాక్టర్లు బిల్లులు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిమంది గుత్తేదారులకు మాత్రమే బిల్లులు అందుతున్నాయని, ఆది నుండి నిర్మాణ పనులు చేసిన వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

దీంతో గతంలో వందల కోట్లు కలిగిన కాంట్రాక్టర్లు నేడు రూ.10, 20 కోట్ల టర్నోవర్‌కే పరిమితమవుతున్నారన్నారు. తద్వారా వారిని నమ్ముకున్న అనేకమంది స్కిల్డ్, నాన్ స్కిల్డ్ కార్మికులు, వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ద్వారా ఇప్పటికే అనేకమంది గుండెపోటుతో మరణించగా, మరికొంతమంది ఆత్మహత్యలకు సైతం పాల్పడడం జరిగిందన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, చేసిన పనులకు ఫస్ట్ క్లారిటీ చొప్పున పెండింగ్ బిల్లుల చెల్లింపు విధానం అమలు చేయాలన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఇష్టారీతిన బిల్లుల చెల్లింపు చేస్తు న్నారని, ఈ విషయాన్ని తెలుసు కునేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్పటికీ ప్రభుత్వం నుండి సమాచారం రావడం లేదన్నారు. చెల్లింపు విధానాలను వెబ్‌సైట్ ద్వారా చూడకుండా సదర్ సైట్లను సైతం క్లోజ్ చేయడం బాధాకరమన్నారు. నేటి వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సుమారు రూ.20 వేల కోట్లు చెల్లించాల్సి ఉంద న్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్టర్లు బిల్లుల కోసం బిక్షగాండ్లుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. తెలంగాణ ప్రభుత్వ అప్పులు

విధిలేని పరిస్థితిలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బిల్లుల చెల్లింపునకై ఈ నెల 18న చలో హైదరాబాద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ వైఖరి మార్చుకుని కాంట్రాక్టర్ల ఇబ్బందులను పరిగణలకు తీసుకుని పెండింగ్ బిల్లులను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి చలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బిల్డర్స్ అసోసియేషన్, వివిధ శాఖలకు చెందిన గుత్తేదారులు, వారి సిబ్బంది కదిలి రావాలని పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమం అనంతరం ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాని ఎడల దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుత్తేదారులు గరికపాటి వెంకటేశ్వరరావు, రామకృష్ణరెడ్డితో పాటు పలువురు ఉమ్మడి జిల్లాకు చెందిన గుత్తేదారులు పాల్గొన్నారు.

# అనురాగ్ 'నల్లగొండ నైట్స్' జెర్సీ ఆవిష్కరణ



నల్గొండ, జూన్ 5: టీజీ 20 లీగ్‌లో నల్లగొండ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అనురాగ్ నల్లగొండ నైట్స్ జట్టు జెర్సీని శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి- భువనగిరి జిల్లాలకు చెందిన 25-30 క్రికెట్ అకాడమీల నుంచి 700 మందికి పైగా యువ క్రికెటర్లు, 60 మందికి పైగా కోచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అనురాగ్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ స్ట్రాటజీ అనురాగ్ పల్లా గ్రామీణ ప్రాంతాల నుండి వెలుగులోకి వస్తున్న క్రికెట్ ప్రతిభను ప్రోత్సహించేందుకు అనురాగ్ యూనివర్సిటీ దీర్ఘకాలిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

యువ క్రీడాకారులకు కోచింగ్, శిక్షణా సదుపాయాలు, ప్రాక్టీస్ మ్యాచ్‌లు, టాలెంట్ ఐడెంటిఫికేషన్ అవకాశాలను అందిస్తూ వారి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక సీజన్ కే పరిమితం కానీ, రాబోయే ఐదేళ్ల పాటు కొనసాగనున్న దీర్ఘకాలిక కార్యక్రమం అని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో టాలెంట్ హంట్లు, ఇంటర్ అకాడమీ టోర్నమెంట్ల నిర్వహణపై కోచ్లు, విద్యార్థులు చేసిన సూచనలను స్వాగతిస్తూ వాటిని అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

అనురాగ్ నల్లగొండ నైట్స్ హెడ్ కోచ్ డి.బి. రవితేజ యువ ఆటగాళ్లతో ప్రత్యేకంగా మమేకమై ఫిట్‌నెస్, నైపుణ్యాల అభివృద్ధి, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, ఆటలో నిరంతర మెరుగుదల వంటి అంశాలపై విలువైన సూచనలు చేశారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫిట్‌నెస్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఆటగాళ్లను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జట్టు అసిస్టెంట్ కోచ్ రోనాల్డ్ రోడ్రిగ్స్, ఫిజియో, ట్రైనర్, మేనేజర్, మెంటర్ తదితర సపోర్ట్ స్టాఫ్‌ను పరిచయం చేశారు. అనంతరం అనురాగ్ నల్లగొండ నైట్స్ అధికారిక జెర్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా అనురాగ్ యూనివర్సిటీ, ప్రాంతీయ క్రికెట్ వర్గాల మధ్య బలమైన భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టబడింది. యువ క్రికెటర్లకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ ప్రాంతీయ క్రికెట్ అభివృద్ధికి ఈ కార్యక్రమం కీలకంగా నిలువనుందని పలువురు పేర్కొన్నారు.

# సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిది

**ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం**



రాజన్న సిరిసిల్ల, జూన్ 5: (నేటినిజం ప్రతినిధి): సమాజాభివృద్ధిలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం అన్నారు. శుక్రవారం వేములవాడ లోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులకు ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు బుస్స దశరథం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్య క్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు నూతన కార్యవర్గ సభ్యుల ను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బుస్స దశరథం మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసే పాత్రికేయుల సేవలు సమాజానికి ఎంతో అవసరమన్నారు.

నూతన కార్యవ ర్గం ఐక్యతతో ముందుకు సాగి జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి కోసం విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరసయ్య లు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం పాత్రికేయుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ఆదర్శవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బుస్స దశరథం, ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌తో పాటు సంఘం ప్రతినిధులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ అందించిన ప్రోత్సాహం తమపై మరింత బాధ్యతను పెంచిందని, పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారు కొత్వాల్ శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు రసూల్, ఉపాధ్యక్షులు చింతలతాడెం దేవరాజ్, విష్ణు, జిల్లా సభ్యులు కంటాల విజయ్, క్యాషియర్ పంపరి నాగరాజు, దెబ్బేటి ప్రవీణ్, సందీప్, ఆర్యవైశ్య మహాసభ సభ్యులు చికోటి అశోక్, బుస్స బుచ్చిబాబు, దైత కుమార్, ఆర్యవైశ్య నాయకులు చేపూరి రవీందర్, చేపూరి గణేష్, వాసవి క్లబ్ గవర్నర్ నరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హెరిటేజ్ ఫుడ్స్ 35వ వ్యవస్థాపక దినోత్సవం..

## ప్యూర్ రిజాల్వ్' స్ఫూర్తితో కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ



హైదరాబాద్, జూన్ 5: భారతదేశంలో ప్రముఖ డైరీ బ్రాండ్ 'హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్' 35వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. డైరీ రైతులకు ఆర్థిక బలాన్ని చేకూర్చడం, వినియోగదారులకు తాజా పాల ఉత్పత్తులను అందించాలన్న లక్ష్యంతో 1992లో ప్రారంభమైంది. 'ప్యూర్ రిజాల్వ్' స్ఫూర్తితో తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. ఈ సందర్భంగా వినియోగదారులను ఆకట్టుకునేలా 'క్రీమీ షేక్' (బాదం, మ్యాంగో ఫ్లేవర్లు), 'ఫ్రోజెన్ మలై పనీర్ క్యూబ్స్' వంటి సరికొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. ఇన్వెస్టర్లతో పారదర్శకమైన సంబంధాలకు ప్రతిష్టాత్మక 'ఐఆర్ ఎక్సలెన్స్ అవార్డు' లభించింది. ఈ సంవత్సరం కొన్ని సవాళ్లు ఎదురైనా డైరీ వ్యవస్థను బలోపేతం చేయడం, వాటాదారులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చడంపై దృష్టి సారించింది. రైతులతో తనకున్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడంలో, సేకరణ నెట్‌వర్క్‌ను విస్తరించడంలో ఈ సంవత్సరం కంపెనీ గణనీయమైన పురోగతి సాధించింది. పాలు సేకరించే పరిధిని పెంచడం, కొత్త చిల్లింగ్ (శీతలీకరణ) మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా.. డైరీ రైతులతో కలిసి పని చేయడానికి, గ్రామీణ స్థాయిలో వారి జీవనోపాధికి మద్దతుగా నిలవడానికి హెరిటేజ్ ఫుడ్స్ తన నిబద్ధతను చాటుకుంది. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హెరిటేజ్ ఫుడ్స్ ఆవిష్కరణ, ప్రాధాన్యత, నాణ్యతపై తనకున్న దృష్టిని ప్రతిబింబించేలా వినియోగదారుల కోసం కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా డిజిటల్ యుగానికి చెందిన జెన్-జీ, యువ మిలీనియల్స్ అభిరుచులకు అనుగుణంగా 'క్రీమీ షేక్' శ్రేణిలో బాదం, మ్యాంగో (మామిడి) ఫ్లేవర్లను విడుదల చేసింది. ఈ ఉత్పత్తులు 165 మి.లీ. కాంపాక్ట్ ప్యాక్‌లో రూ. 40 ధరతో లభిస్తాయి. బాదం క్రీమీ షేక్: బాదం ముక్కలు, 5.2 శాతం ఫ్యాట్ (కొవ్వు)తో రిచ్ క్రీమీ రుచిని అందిస్తుంది. మ్యాంగో క్రీమీ షేక్: మామిడి పండ్ల గుజ్జు (పల్ప్), 3.8 శాతం ఫ్యాట్‌తో లభిస్తుంది.

యువతను ఆకట్టుకునే ప్యాకేజింగ్, 'డిజిటల్-ఫస్ట్' విధానంతో రూపొందించబడినవి.

ఆరోగ్యకరమైన, రిఫ్రెషింగ్ రోజువారీ ఉత్పత్తిపై అవగాహన పెంచే లక్ష్యంతో 'హెరిటేజ్ ప్రోబయోటిక్ బటర్‌మిల్క్ ఇన్‌ఫ్లుయెన్సర్ క్యాంపెయిన్'ను ప్రారంభించింది. ఈ ప్రచారం ద్వారా మజ్జిగ సాంప్రదాయకమైనదే కాకుండా ఆధునిక జీవనశైలికి సరిపోయే ఆరోగ్యకరమైన ఎంపిక అని తెలియజేస్తోంది. డిజిటల్ మాధ్యమాల ద్వారా నేటి తరం వినియోగదారులకు మరింత చేరువవడానికి ఇది ఉపయోగపడుతుంది. 'ఫ్రోజెన్ మలై పనీర్ క్యూబ్స్'ను కూడా పరిచయం చేసింది. ఇది మృదుత్వం, క్రీమీ రుచితో పాటు ప్రొటీన్, కాల్షియంలను పుష్కలంగా అందిస్తుంది. ఆరు నెలల షెల్ఫ్ లైఫ్ (నిల్వ సామర్థ్యం) ఉండేలా రూపొందించిన ఈ ఉత్పత్తి.. వినియోగదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా, హెరిటేజ్ సంస్థ అందించే తాజాదనం, నాణ్యత, నమ్మకానికి ప్రతీకగా నిలుస్తుంది. ఐఆర్ సొసైటీ వారిచే ఫుడ్ & బెవరేజ్ విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్ 'ఐఆర్ ఎక్సలెన్స్ అవార్డు'తో సత్కరించబడింది. అత్యుత్తమ కార్పొరేట్ గవర్నెన్స్, పెట్టుబడిదారులతో అర్థవంతమైన సంబంధాలను కొనసాగించడంలో కంపెనీకి ఉన్న నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనం.

# ప్రముఖ డిజైన్ కాలేజ్ 'హామ్స్టెక్', ఎస్ఆర్ యూనివర్సిటీతో భాగస్వామ్యం



హైదరాబాద్, జూన్ 5:అంతర్జాతీయ స్థాయి డిజైన్ విద్యను అందుబాటులోకి తెస్తూ హైదరాబాద్కు చెందిన లీడింగ్ డిజైన్ ఇనిస్టిట్యూట్ 'హామ్స్టెక్', వరంగల్లోని 'ఎస్ఆర్ యూనివర్సిటీ'తో చేతులు కలిపింది. ఈ భాగస్వామ్యం ద్వారా వరంగల్లో 'హామ్స్టెక్ పవర్డ్ ఎస్ఆర్యూ స్కూల్ ఆఫ్ డిజైన్' ఏర్పాటు కానుంది. డిజైన్ శిక్షణలో హామ్స్టెక్ కు ఉన్న మూడు దశాబ్దాల అనుభవం, అకడమిక్ ఫ్రేమ్వర్క్, ఆధునిక మౌలిక సదుపాయాలు, జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఎస్ఆర్ యూనివర్సిటీకి చెందిన 150 ఎకరాల ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ ఈ సహకారంతో ఒకే చోటకు చేరాయి.

పరిశ్రమలలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అత్యుత్తమ అభ్యసన వాతావరణాన్ని అందించడమే ఈ రెండు సంస్థల ముఖ్య ఉద్దేశ్యం. ఈ ఎస్ఆర్యూ స్కూల్ ఆఫ్ డిజైన్ ప్రారంభంలో భాగంగా ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ అనే రెండు బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (ః.ఆవబ) ప్రోగ్రామ్లను ప్రారంభించనుంది. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడం, డిజైన్ రంగంలో అద్భుతమైన కెరీర్కు సిద్ధం చేయడంపై దృష్టి పెడతాయి. ఇక్కడి పాఠ్యప్రణాళిక ముఖ్యంగా ప్రాక్టికల్ ట్రైనింగ్, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, పరిశ్రమ లోని వాస్తవ డిజైన్ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా రూపొందించబడింది. ఫ్యాషన్ డిజైన్ ప్రోగ్రామ్ను మరింత బలోపేతం చేస్తూ జాతీయ అవార్డుల గ్రహీత, ప్రముఖ డిజైనర్ నీతా లుల్లా 'సెలబ్రిటీ మెంటర్'గా చేరారు. ఆమె ఈ రంగంలో రాణించా లనుకునే విద్యార్థులకు విలువైన పరిశ్రమ అనుభవాలను, సలహాలను అందించి మార్గనిర్దేశం చేయనున్నారు.

ఈ సందర్భంగా ఎస్ఆర్ యూనివర్సిటీ ఛాన్సలర్ ఏ వరదారెడ్డి మాట్లాడుతూ మారుతున్న డిజైన్ రంగానికి అనుగుణంగా విద్యార్థులకు పరిశ్రమకు అవసరమైన జ్ఞానం, ప్రాక్టికల్ అనుభవం, సృజనాత్మక విశ్వాసాన్ని అందించడమే ఈ భాగస్వామ్యం ముఖ్య ఉద్దేశమన్నారు. డిజైన్ విద్యకు ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో భవిష్యత్తును సృజనాత్మకత, ఆవిష్కరణలే నిర్దేశిస్తాయని నమ్ముతున్నామని పేర్కొన్నారు.

# కంపోస్టు షెడ్డులో సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫెరోజ్ పాషా పరిశీలన

రాజన్న సిరిసిల్ల, జూన్ 5: (నేటినిజం ప్రతినిధి): :బహుసాయిపేట గ్రామంలో ఉన్న కంపోస్టు షెడ్డును గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫెరోజ్ పాషా, గ్రామ కార్యదర్శి రాధికతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కంపోస్టు తయారీ విధానం, పరిశుభ్రత నిర్వహణ, తడి-పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ, కంపోస్టు నిల్వ, నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష చేపట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచడంతో పాటు చెత్తను శాస్త్రీయంగా నిర్వహించి సేంద్రీయ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచేందుకు ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫెరోజ్ పాషా కోరారు. గ్రామాభివృద్ధి, స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆమె పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.